

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
శనివారం 2 నవంబరు 2024





ఆనందం.. విషాదం



జిల్లా ప్రజలు గురువారం రాత్రి దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఏలూరులో బైక్‌పై మూటకట్టి తీసుకువెళుతున్న ఉల్లి బాంబులు పేలి.. ఒకరు మృతి చెందగా ఎనిమిది మంది గాయపడడంతో విషాదం నెలకొంది.5లో..

కార్తీకం.. శివోహం

నేటి నుంచి కార్తీక మాసం మొదలైంది. నెల రోజులపాటు శైవక్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగనున్నాయి. ఆలయాన్నీ విద్యుత్ దీప కాంతులతో ముస్తాబయ్యాయి. శనివారం ఉదయం భక్తులు పుణ్య నదీ స్నానాలు ఆచరించనున్నారు. ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.4లో..



విద్యుత్ వెలుగుల్లో భీమవరం సోమేశ్వరస్వామి ఆలయం



ఐఎస్ జగన్నాథపురంలో ఉచిత సిలిండర్‌ను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు మద్దిపాటి, బాలరాజు తదితరులు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం

» ఐఎస్ జగన్నాథపురంలో ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఏలూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేసే దీపం-2 పథకానికి శుక్రవారం శ్రీకారం చుట్టింది. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ ఈ పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. చింతలపూడిలో గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, దెందులూరులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటి, కైకలూరులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, నిడమర్రులో ఎమ్మెల్యే పత్సమట్ల దర్మరాజు, కొయ్యలగూడెంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం 40 వేల మంది బుకింగ్ చేసుకున్నట్టు పౌరసరఫరాల అధికారులు చెప్పారు. వీరికి శుక్రవారం మధ్యాహ్నం నుంచి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు.

94 శాతం పింఛన్‌ల పంపిణీ

వేధించిన సర్వర్ సమస్య

ఏలూరు సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో నవంబరుకు సంబంధించి పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో సర్వర్ సమస్య జటిలంగా మారింది. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించిన సమయంలో సర్వర్ సమస్య లేకపోయినా ఆ తర్వాత ఒక గంట తర్వాత సర్వర్ సమస్య తలెత్తిందని చెబుతున్నారు. దీంతో పింఛన్‌ల పంపిణీ మధ్యాహ్నానికి పూర్తవుతుందనుకున్నా సాయంత్రం వరకు కొనసాగింది. భీమడోలులో పింఛన్‌ల పంపిణీలో సర్వర్‌లు మొరాయించాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లోను ఇదే సమస్య నెలకొంది. జిల్లాలో 2,63,768 మంది పింఛన్‌దారులుండగా శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్‌ల పంపిణీ ప్రారంభమైందని, రాత్రి ఏడు గంటల నాటికి 2,48,768 (94.36 శాతం)మందికి పింఛన్‌లు పంపిణీ చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో రూ.112.74 కోట్లు విడుదల చేయగా రూ.106.39 కోట్లు పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలోని 5,299 మంది సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి పింఛన్ సొమ్ములను అందించారన్నారు. మిగిలిన లబ్ధిదారులకు, వివిధ ఆరోగ్య సమస్యలతో ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులలో చికిత్స పొందు తున్న లబ్ధిదారులకు మానవతా దృక్పథంతో పింఛన్లు అందిం చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పింఛన్ పొందనివారికి సిబ్బంది స్వయంగా ఫోన్ చేసి శనివారం సాయంత్రంలోగా నూరుశాతం పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్, చిత్రంలో మంత్రి దుర్గేష్, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎమ్మెల్యేలు వెంకట్రాజు, ధర్మరాజు



ఐఎస్ జగన్నాథ పురంలో మూల విరాట్‌ను దర్శిం చుకుంటున్న పవన్ కల్యాణ్

నరసింహుడే.. నడిపించాడు

'ఈ ఊరు మా గురువుగారిది. శక్తివంతమైన నేల. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నేను పదే పదే ఇక్కడ వేంచేసియున్న లక్ష్మీనరసింహాస్వామికి మొక్కా. 2009లో స్వామిని తొలిసారిగా దర్శించి తగినంత శక్తినివ్వాలని కోరుకున్నా. స్వామి అంత తేలిగ్గా కటాక్షించరు. పద్నాలుగేళ్లు పరీక్ష పెట్టారు. చిమ్మ చీకట్లో నేను ఎటు వెళ్తున్నానో తెలియని పరిస్థితి. ఎక్కడా వెలుతురు లేదు. దీపం వెలిగిస్తే ఆ వెలుగే అత్యద్భుతం. అత్యంత బలమైనది. ఇక్కడా అదే జరిగింది. ఎన్‌డీఏను నిలబెట్టేటంత స్థాయికి స్వామి తీసుకెళ్లారు' అంటూ పవన్ కల్యాణ్ తన జ్ఞాపకాలను ప్రజల ముందుంచారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

'నేను త్రికరణశుద్ధిగా నమ్మి ఆరాధించిన జగన్నాథపురం లక్ష్మీ నరసింహుడే నన్ను విజయపథాన్న నడిపించారు. ఇటువంటి మహత్తర పుణ్య క్షేత్రానికి తగినన్ని హంగులు కల్పించడమే కాదు పర్యాటకంగా తీర్చిదిద్దాలని నిర్ణయించా'నని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. ఆ మేరకు ఆయన లక్ష్మీనరసింహుని కొండపై ప్రత్యేకంగా యాగం చేశారు. అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. ద్వారకా తిరుమల మండలం ఐ.ఎస్.జగన్నాథపురానికి శుక్రవారం విచ్చేసిన ఆయన దీపం-2 గ్యాస్ సిలిండర్లను పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన సభలో ఆయన లక్ష్మీ నరసింహస్వామికి తనకున్న అనుబంధాన్ని ప్రజల ఎదుటే తన మనస్సులోని మాట బయటపెట్టారు. ఆలయ అభివృద్ధికి అధికారులతో మాట్లాడిన తర్వాత కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్టు చెప్పారు. ఆ

మహిళల రక్షణకే ప్రాధాన్యత

మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మా నేత పవన్ కల్యాణ్ ఉద్దేశం. వారి ఆర్థిక భారం తగ్గించేందుకే ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని సంకల్పించారు. జగన్ ఖజానా ఖాళీ చేస్తే చంద్రబాబు, పవన్, మోదీ పట్టాలు తప్పిన ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించారు.

కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి

పద్నాలుగేళ్లు సుదీర్ఘ పరీక్ష పెట్టాడు

ఐఎస్ జగన్నాథపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

స్వామివారే నన్ను స్వయంగా ఇక్కడకు పంపారు. ముందుగా ఇక్కడకు రావాలని షెడ్యూల్ లేదు. గురువారం మధ్యాహ్నం అధికారులు నిర్దేశించారు. అప్పటికప్పుడు స్వామివారి ఆజ్ఞ మేరకే ఇక్కడకు వచ్చాను. గుడి ప్రాకారానికి అనువుగా రెండున్నర కోట్లు వ్యయం అవుతుందని అధికారులు చెప్పారు. కొండను తవ్వడం ద్వారా రక్షణ గోడ నిర్మించాల్సి వస్తుందని, దీనికి రెండు కోట్ల రూపాయలు ఖర్చవుతుందని పవన్ అన్నారు. ఈ రెండింటి వ్యయంపైనా కలెక్టర్ వెట్రిసెల్వితోను మాట్లాడాను. తక్షణం ఈ రెండు పనులకు ఎటువంటి అభ్యంతరాలు లేవని, మిగతా అధికారులు చెప్పిన తర్వాతే వీటి ఆమోదానికి వీలు ఏర్పడిందన్నారు. కొండపైకి వెళ్ళే మార్గానికి మరమ్మతులు, అనువైన పరిస్థితులు సృష్టించేందుకు ఎంతకాలం పడుతుందని కలెక్టర్‌ను కోరితే మూడు నెలల వ్యవధి సరిపోతుందని జవాబు ఇచ్చారన్నారు. ఈ దేవాలయం పరిధిలో చిక్కుల్లో వున్న 50 ఎకరాల భూమికి మ్యూటేషన్ జరిపి ఎండోమెంట్‌కు అప్పగిస్తామన్నారు.

కొండ తవ్వకంపై నివేదికివ్వండి

అంతకుముందు అధికారులతో ఈ దేవాలయానికి సంబంధించి అభివృద్ధి, సంక్షేమంపై ఏవేమి చర్యలు తీసుకోవాలో పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీకృష్ణ తేజ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కొమ్మి శివప్రతాప కిశోర్, జేసీ ధాత్రి రెడ్డిలతో సుదీర్ఘంగా సమావేశమయ్యానని, ఈ ప్రాంతం అత్యద్భుత ప్రాంతం అంటూ పవన్ చెప్పుకొచ్చారు. ఇలాంటి పవిత్ర పుణ్యక్షేత్రం పొరుగునే ఉన్న కొండను కొందరు తవ్వి తీసుకు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అసలు ఇలాంటి అనుమతులు ఎవరిచ్చారని పవన్ అధికారులను ఆరా తీశారు. ఈ ఆలయానికి 50 ఎకరాల వరకు భూములు ఉండగా వాటి రక్షణకు ఏ చర్యలు తీసుకున్నారో తెలపాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఉన్న కొండ భూమిని సమీపాన ఉన్న హైవే నిర్మాణానికి వినియోగిస్తున్నామని చెప్పి భారీగా తవ్వుకుపోతున్నారని, అసలు ఈ కొండ తవ్వకం ఎవరు చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారు, నిజంగానే హైవే నిర్మాణానికి చేస్తున్నారా, లేక ఇంకేదైనా లోగుట్టు ఉందా అని నిగ్గ తేల్చి వారంలోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్‌కు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గోతులున్న రోడ్లను పూడ్చి వేసేందుకు శనివారం నుంచి ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు మంత్రి పవన్ ప్రకటించారు.

చిరస్థాయిగా నిలిచిపోతుంది

దీపం-2 పథకం ఆరంభానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వయంగా ఇక్కడకు రావడం చరిత్రలో నిలిచిపోతుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారధి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నివృతరావు తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల సందడి

ఐ.ఎస్.జగన్నాథపురానికి వచ్చిన పవన్‌ను దగ్గరగా తిలకించాలని ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు పోటీ పడ్డారు. మండుటెండను లెక్క చేయకుండా భారీగా సభాస్థలికి తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని ప్లకార్డులు చూపిన జి.కొత్తపల్లికి చెందిన వారి వద్దకు మంత్రి పవన్ పీఏ స్వయంగా వెళ్ళి ఆరా తీశారు. మూత్ర పిండాలు, లివర్ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తమకు న్యాయం చేయాలని వారు కోరడంతో న్యాయం చేస్తానని సభావేదిక మీద పవన్ ప్రకటించారు.



గేటు పడితే.. అరగంట ఆగాల్సిందే!

దెందులూరు రైల్వే గేటుతో జనం ఇబ్బందులు

ఫ్లయ్ ఓవర్ నిర్మించాలంటూ 15 గ్రామాల ప్రజల విజ్ఞప్తి



దెందులూరు రైల్వేగేటు

దెందులూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు-శ్రీరామవరం రైల్వే గేటుకు మోక్షం కల్పించండి మహాప్రభో అంటూ ఎన్నో ఏళ్లగా 15 గ్రామాల ప్రజలు , రైతులు, వాహనాదారులు విన్నవిస్తూనే ఉన్నారు. గేటు పడితే నాలుగైదు రైళ్ల వెళ్లే వరకు గేటు తీయకపోవడంతో 30 నిముషాలకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైల్వేగేటు స్థానంలో ఫ్లయ్‌ఓవర్ నిర్మించి సమస్య పరిష్కరించాలని రామారావుగూడేంకు చెందిన రైల్వే ఫ్లయ్‌ఓవర్ పోరాట సమితి అధ్యక్షుడు మద్దా భూషణం గతంలో కోర్టును ఆశ్రయించడంతో పాటు, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చంద్రబాబు దెందులూరు- పంగిడిగూడెం రోడ్డును అభివృద్ధి చేసేందుకు నిధులు విడుదల చేశారు. సింగిల్ రోడ్డును రెండులైన్ల రహదారిగా విస్తరించేలా అప్పటి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చర్యలు తీసుకుని రోడ్డు పనులు చేయించారు.అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని మంజూరు చేయించారు. అయితే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఫ్లయ్ ఓవర్ కోసం రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అయితే ఆపై ప్రభుత్వం మారింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ విషయం లో ఎటువంటి చర్యలు చర్యలు తీసుకోలేదు. నూతన కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఫ్లయ్‌ఓవర్ మంజూరు చేయించాలని ఏలూరు ఎంపీ, దెందులూరు ఎమ్మెల్యేలను ధర్మారావుపేట, కొత్తకమ్మవారిగూడెం, కన్నాపురం, గోవిందపురం, పాలకమ్మవారిగూడెం, రామారావుగూడెం, చల్లచింతలపూడి, పెరుగు గూడెం, శ్రీరామవరం, అప్పారావుపాలెం, మేదినరావుపాలెంతో పాటు 15 మెట్ట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి విఘాతం



దెందులూరు-పంగిడిగూడెం రహదారిలో రైల్వేగేటు ఉండటంతో మెట్ట గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. గంటల తరబడి రైల్వేగేటు వద్ద ప్రజలు వేచి ఉండాల్సి రావడంతో భీమడోలు మీదుగా రవాణా సౌకర్యం పెరిగి ఇటు దెందులూరు అభివృద్ధి చెందడం లేదు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు సైతం గేటు వద్ద అరగంట నిలిచిపోవాల్సి వస్తోంది.

- మద్దా భూషణం రామారావుగూడెం ఫ్లైఓవర్ పోరాటసమితి అధ్యక్షుడు

తీవ్రంగా నష్టపోతున్నారు..



రైల్వే గేటు వల్ల రైతులు, కూలీలు, ఫ్యాక్టరీ యాజమానులు, చిన్నపరిశ్రమల వారు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఫ్లయ్‌ఓవర్ నిర్మాణం చేపట్టాలి.

- కలపాల చంద్రశేఖర్, రైతు, సత్యనారాయణపురం



5

టీడీపీ-జనసేన నేతల కొట్లాట

పైడిచింతపాడులో ఉద్రిక్తం..

పింఛన్ల పంపిణీలో దాడులు

అత్యున్నతంగా ఉద్యాన వర్సిటీ



'ఉద్యాన విశ్వ విద్యాలయం ఐదేళ్లుగా ర్యాంకింగ్స్‌లో 40 స్థానాలకు దిగజారింది. రాబోయే రోజుల్లో అత్యున్నతంగా తీర్చిదిద్దాలి. నేను బాధ్యతలు చేపట్టగానే అర్హతను బట్టి ఉన్నతాధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చా'నంటున్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కురుబా గోపాల్ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 4లో..

మూడేళ్లుగా అందని యూనిఫాం!

» ట్రిపుల్ ఐటీ విద్యార్థులను వెంటాడుతున్న అసౌకర్యాలు

» పీయూసీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఎప్పటికి అందేనో?



నూజివీడు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఐటీలలో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు అందించడంలో ట్రిపుల్ ఐటీ యాజమాన్యం వైఫల్యం చెందుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ పాలకుల పాపం నేడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు శాపంగా మారుతోంది. 2008లో జీవో నంబరు 18 ద్వారా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం, నూజివీడు ఆర్కేవ్యాలీ, బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసి ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను ప్రవేశపెట్టింది. ఒక్కో క్యాంపస్‌లో 2వేల సీట్లతో ప్రారంభించినా అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోశయ్య సీట్ల పరిమితిని వెయ్యికి తగ్గించారు. రాష్ట్రవిభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ తెలంగాణకు వెళ్లగా ఆంధ్రప్రదేశ్‌లో ఆర్కేవ్యాలీ, నూజివీడు క్యాంపస్‌లు మిగిలాయి. దీంతో సీట్లను పెంచాలని, విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తుల నేపథ్యంలో నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు నూజివీడు, ఆర్కేవ్యాలీలతో పాటు నూతనంగా శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. మౌలిక వసతుల కల్పన పూర్తయ్యేవరకు ఆయా క్యాంపస్‌లు నూజివీడు, ఆర్కేవ్యాలీలలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. తదనంతరం భూసేకరణ, భవనాల ఏర్పాటును చేపట్టగా అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీంతో నేటికీ ఆయా క్యాంపస్‌ల భారం నూజివీడు, ఆర్కేవ్యాలీల పైనే ఉంది. ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ విద్యను అందిస్తుండగా దాదాపు ప్రతి క్యాంపస్‌లోనూ 6,600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం ఆర్జీయూకేటీ పరిధిలో 26,400 మంది విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు.

మూడేళ్లుగా యూనిఫాం లేదు..

ఆర్జీయూకేటీ పరిధిలో విద్యార్థులకు మూడేళ్లుగా యూనిఫాంను అందించడంలో యూనివర్సిటీ యాజమాన్యం వైఫల్యం చెందింది. ఫలితంగా ట్రిపుల్ ఐటీలో ఉన్న విద్యార్థుల్లో పీయూసీ విభాగంలోని 8,800 మంది విద్యార్థులకు నేటికీ అసలు యూనిఫాం అందలేదు. ఇంజనీరింగ్ విద్యార్థులకు గతంలో ఇచ్చిన యూనిఫాం ఉన్నా దాదాపు మూడేళ్లుగా అదే యూనిఫాం ఉండడంతో పాతబడి ఆ యూనిఫాం పక్కన పడేసే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా తమ పరిస్థితిని వివరిస్తూ విద్యార్థులు పలుమార్లు యూనిఫాంను ఇవ్వాలని కోరుతూ ఆర్జీయూకేటీ యాజమాన్యానికి అర్జీలమీద అర్జీలు ఇచ్చినా ఫలితం మాత్రం అందలేదు.

లెర్నింగ్ బై డూయింగ్ నుంచి అడాప్టెడ్ టీచింగ్ వైపు..

గత పాలకుల హయాంలో ల్యాప్‌టాప్‌లను సరైన సమయంలో విద్యార్థులకు అందించడంలో వైఫల్యం కారణంగా ఆర్జీయూకేటీ స్థాపన సమయంలో ఎంచుకున్న లెర్నింగ్ బై డూయింగ్ విధానం నుంచి అడాప్టెడ్ టీచింగ్ వైపు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం అడుగులు వేయాల్సి వచ్చింది. సాంకేతికతతో కూడిన విద్యను అందించాల్సిన ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ద్వారా వచ్చే విద్యార్థులను ముందుగా గుర్తించి మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాల్సి ఉండగా, ఆ దిశగా అడుగులు వేయలేదు. ఫలితంగా ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌లలో 4,400 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు లేకుండానే విద్యా బోధన సాగుతోంది.

వసతి సౌకర్యాల్లోనూ వైఫల్యం

రెసిడెన్షియల్ విధానంలో బోధన సాగించే ఆర్జీయూకేటీ చివరికి వసతి సౌకర్యాలు అందించడంలోనూ వైఫల్యం చెందింది. విద్యాసంవత్సరం ప్రారంభంలో నాసిరకపు భోజన వసతిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మెస్‌ల మార్పుకు సంబంధించి నవంబరు ప్రథమార్థంలో నూతన మెస్‌లు ఏర్పాటు చేస్తామని యాజమాన్యం ప్రకటించింది. అయితే ఆ దిశగా ఎటువంటి చర్యలు లేవు. చివరికి వసతి గృహాల్లో బెడ్‌ల పై పరుపులు సైతం విద్యార్థులకు అందించకపోవడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై గతంలో పనిచేసిన డైరెక్టర్ విద్యార్థులనే వసతికి కావాల్సిన వస్తు సామగ్రిని తెచ్చుకోవాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం విమర్శలకు కారణమైంది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా నేటికీ వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పడలేదు. కూటమి ప్రభుత్వమైనా పూర్తిస్థాయిలో దృష్టి సారించి విద్యార్థులకు అందించాల్సిన ల్యాప్‌టాప్‌లు, యూనిఫాం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పనకు తక్షణ చర్యలు చేపటాల్సి ఉంది.

అత్యున్నత వర్సిటీగా తీర్చిదిద్దుతా..

'ఆంధ్రజ్యోతి'తో ఉద్యాన వర్శిటీ ఉపకులపతి డాక్టర్ గోపాల్

ఇంటర్వ్యూ..



ఉద్యాన విశ్వవిద్యాలయం అయిదేళ్లుగా దేశంలోని ర్యాంకింగ్స్‌లో 40 స్థానాలకు పైగా దిగజారిపోయింది. అలాంటి వర్శిటిని రాబోయే రోజుల్లో అత్యున్నత వర్శిటిగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ కురుబా గోపాల్ అన్నారు. యూనివర్సిటీలో ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: ఉద్యాన వర్సిటి ప్రక్షాళనకు ఏం చర్యలు తీసుకున్నారు?

వీసీ: ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి పదోన్నతుల కోసం ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. దానికి తోడు ఎవరికి కావాల్సిన పోస్టులు వారు వేయించుకుని అర్హత ఏమి లేకుండా జరిగింది. నేను పదవి చేపట్టగానే అర్హతను బట్టి ఉన్నతాధికారులను భర్తీ చేశాం. దీంతో ఏ పోస్టులో ఉండాల్సిన సామర్థ్యం వారికి ఉంది. దీంతో రాబోయే రోజుల్లో వారి ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చనేదే మా భావన.

ఆంధ్రజ్యోతి: వర్సిటి పరిధిలో కొత్త కోర్సులు ఏమైనా ప్రారంభిస్తున్నారా?

వీసీ : ఉద్యాన వర్సిటి పరిధిలో ఈజిప్ట్ కోర్సులైన జనరిక్స్, ప్లాంట్ బ్రీడింగ్, సాయిల్ సైన్స్ కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నాం. వాటితోపాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఫాస్ట్ ఆర్వెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు కూడా ప్రారంభించనున్నాం. ఈ కోర్సులకు జనవరిలో కౌన్సెలింగ్ ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: వర్సిటీలో ఫర్నిచర్ మాయమైందనే విమర్శలు వచ్చాయి?

వీసీ: కంప్ట్రోలర్ నిర్లక్ష్యం వల్ల ఫర్నిచర్ మాయమైందనేది అవాస్తవం. ఆ విధుల్లో ఉన్న ఉద్యోగి సరిగా విధులకు హాజరు కాకపోవడంతో వర్శిటి పరిపాలనా పరమైన సమస్య వచ్చింది. దీంతో ఆ ఉద్యోగిని ఆమె సొంత శాఖకు బదిలీ చేశాం. ఇక ఫర్నీచర్ విషయానికి వస్తే కొనుగోలు చేసిన ఫర్నీచర్ అంతా ఉంది. కానీ ఏ విభాగంలో ఏమేమి ఉన్నాయో అర్థం కాక మాయమైందనే విమర్శలు వచ్చాయి. వాటన్నింటి లెక్కలు తేల్చాం.

ఆంధ్రజ్యోతి: విశ్వవిద్యాలయం పనితీరు మెరుగుకు తీసుకున్న చర్యలు?

వీసీ: గతంలో లేని విధంగా ఉద్యాన వర్సిటి పరిధిలో విద్యార్థుల స్థితగతులు, ర్యాంకులు ఎప్పటికప్పుడు సమీక్షించి వారికి ఇంటర్నల్ ర్యాంకింగ్స్ ఇచ్చి ఇటు విద్యార్థుల్లో అటు అధ్యాపకుల్లో స్పిరిట్ నింపేందుకు పీఎంబీలో ఓ డైరెక్టర్‌ను నియమించాం. ఆ విభాగం ద్వారా విద్యా సంబంధిత అంశాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకున్నాం. మరో రకంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో వారి విధులు శాఖా పరమైన అంశాలపై అవగాహన కల్పించి వారిని ముందుకు నడిపే విదంగా చర్యలు తీసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్త పరిశోధనలు ఏం చేపట్టారు?

వీసీ: ఉద్యాన వర్సిటి పరిధిలో కేంద్రం ద్వారా మూడు ఏసీఆర్‌బీ సెంటర్‌లు ప్రారంభించనున్నాం. దీని ముఖ్య ఉద్దేశం పొటెన్షియల్ క్రాఫ్‌ను అభివృద్ధి చేయడం. అంటే దుంపలు, ఆకు కూరలు, మెడిసిన్ ప్లాంట్స్, బీన్స్ తదితర పంటలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఈ ఏసీఆర్‌బీ సెంటర్‌లు ఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు?

వీసీ: దర్శి (ప్రకాశం), మహానంది(నంధ్యాల), పెద్దపేట(శ్రీకాకుళం) ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. వాటిలో శాస్త్రవేత్తలను కూడా నియమించాం. వారికి మేఘాలయాలో శిక్షణ కూడా అందించి పరిశోధనలు సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటికే ఉన్న పరిశోధనా కేంద్రాల అభివృద్ధికి తీసుకున్న చర్యలు?

వీసీ: ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో పరిశోధనా కేంద్రాలు బాగానే పనిచేస్తున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో పరిశోధనల ప్రగతి సమీక్షించి అభివృద్ధి పరిచేందుకు నూతనంగా డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ వ్యవస్థను అభివృద్ధి చేశాం.

ఆంధ్రజ్యోతి: రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎం ఎలా నడుస్తోంది?

వీసీ: ఇప్పటి వరకూ ఎఫ్‌ఎం రేడియో (కమ్యూనిటి రేడియో) రోజుకు రెండు గంటలు మాత్రమే రైతులకు సమాచారం అందించేందుకు ఉపయోగిస్తున్నాం. అది వర్శిటి కి 20 కిలోమీటర్ల పరిధిలో ఎఫ్‌ఎం ఫ్రీక్వెన్సీ అందుతోంది. దానికి దేశం మొత్తం సమాచారం తెలుసుకునే విధంగా నూతనంగా ఓ యాప్ ప్రారంభించేందుకు చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్న గ్రామాల పురోగతి ఏమిటి?

వీసీ: విశ్వవిద్యాలయం పరిధిలో 42 గ్రామాలను దత్తత తీసుకుని రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించడం, సబ్సిడీపై మొక్కలు అందించడం చేశాం. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి యూనివర్శిటి ప్రగతి విస్తరింపజేస్తాం.

- తాడేపల్లిగూడెం రూరల్

శివ పూజకు వేళాయె..



• నేటి నుంచి కార్తీకమాస పూజలు • ఆలయాల ముస్తాబు.. ఏర్పాట్లు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్/పోలవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం వచ్చేసింది. శివ పూజకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని రెండు పంచారామాలతోపాటు ప్రముఖమైన జుత్తిగలోని ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి, ఆచంటలోని రామేశ్వర స్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేవదాయధర్మాదాయ శాక జిల్లా అధికారి సుబ్బారావు పలు దేవాలయాల్లో పర్యటించి కార్తీకమాసం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామాలకు బస్సులు

కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు పంచారామాల దర్శనానికి ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. పంచారామ దర్శిని పేరుతో బస్సులు జిల్లాలోని 4 డిపోల నుంచి నడపేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి సోమవారం నాడు పంచారామాల్లోని స్వామి వార్లను దర్శించుకునేందుకు ఆర్టీసీ ద్వారా శుక్రవారంనాటికి 7 బస్సులు బుక్ అయ్యాయి. ఇందులో భీమవరంనుంచి 3, నరసాపురం నుంచి 1, తాడేపల్లిగూడెం నుంచి 1, తణుకు డిపో నుంచి 2 బస్సులు సిద్ధం అయ్యాయి.

పట్టిసీమలో యుద్ధప్రాతిపదికన సౌకర్యాలు

పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం పట్టిసీమలో వసతులేవి అనే శీర్షికన వచ్చిన వార్తా కథనానికి స్పందన లభించింది. ఆలయ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాల ఏర్పాటు పనులు వేగవంతంగా నిర్వహించారు. భక్తులు ఇసుక తిన్నెల్లో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు విద్యుద్దీపాలు, ఆలయ ప్రాంగణంలో రద్దీ నివారణకు క్యూలైన్లు, ఫ్యాన్లు, బారికేడ్‌లు, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మరమ్మతుకు గురైన మంచినీటి ఆర్వో సిస్టంను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్తీకమాసం నెలరోజులు నిత్యాన్నదానం, అల్పాహారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. 15 తేదీ శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి లక్షపత్రి పూజ, సాయంత్రం ఆరు గంటలకు గోదావరి హారతి కార్యక్రమం అనంతరం పట్టిసీమ గ్రామంలో జ్వాలాతోరణం సేవ , 25వ తేదీ 4వ సోమవారం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి లక్షదీపోత్సవం నిర్వహిస్తామని ఆలయ నిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.

రేవు ఇలా.. స్నానాలు చేసేది ఎలా..?

నరసాపురం రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుల్లంక గ్రామంలోని స్నానాల రేవు అధ్వానంగా మారింది. రేవులో చెత్తా, చెదారం తొలగించలేదు. కార్తీకమాసంలో భక్త లు ఈ రేవులోనే గోదావరిలో పుణ్యస్నా నాలు అచరించి సమీపంలోని లక్ష్మ జేశ్వర స్వామిని దర్శించుకుంటారు. అయితే రేవు అధ్వానంగా ఉండటంతో స్నానాలు చేసేది ఎలా అంటూ భక్తులు మండిపడుతున్నారు.





పట్టిసీమలో ఏర్పాటు చేసిన క్యూలైన్ బారికేడ్‌లు

నది పరీవాహక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు

భీమవరం క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించే ముఖ్యమైన సముద్రతీర ప్రాంతాలు, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు, కాలువల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. తెల్లవారు జాము స్నానాలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ వెంట పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లినట్లయితే వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు ఒంటరిగా వెళ్ళకూడదని, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో తెలియని లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్ళకూడదన్నారు. దీపాలు వెలిగించే సమయంలో మహిళలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులు శైవ ఆలయాలకు, ఘాట్ల వద్ద స్నానాలు చేయడానికి వచ్చినప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమైన ఘాట్ల వద్ద, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పంచారామ క్షేత్రాల్లో ఏర్పాట్లు



సోమేశ్వర స్వామికి అలంకరణ

గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను వన్‌టౌన్ సీఐ నాగరాజు పరిశీలించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజును అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్‌లు, ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదాన్ని అందిస్తామని తెలిపారు. దేవస్థానం వద్ద చలువ పందిళ్ళు వేశారు. మంచినీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ప్రతిసోమవారం ఆలయం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నారు. క్షీరా రామలింగేశ్వర ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటుగా భక్తులకు మూడు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం.. అభిషేక దర్శనంగా ఏర్పాటు చేసి తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతి, వైద్య శిబిరం, వర్షం వస్తే మేట్ల ఏర్పాటు, టాయ్‌లెట్స్ వంటి ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీస్, ఫైర్ సర్వీసు, వలంటీర్ల సేవలు వినియోగిస్తున్నామని ఈవో ముచ్చర్ల శ్రీనివా సరావు తెలిపారు. రేపాకవారి సత్రంలో కార్తీక మాసం అన్నిరోజులు మధ్యాహ్నం భోజనం ఉచితంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



విద్యుత్ వెలుగుల్లో క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం

గోదావరి జిల్లాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ ఎంపీ చేగొండి హరి రామ జోగయ్య లేఖ



పాలకొల్లు , నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వానికి కూడా గోదావరి జిల్లాల అభివృద్ధి పట్టదా అని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య ప్రశ్నించారు. శుక్రవారం జోగయ్య ఒక లేఖను రాశారు. దీని సారాంశం ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధి పట్ల గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా అలక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. పలు అంశాలను పరిశీలిస్తే గోదావరి పరీవాహక ప్రాంతంలో పలు విధాల అభివృద్ధి చేపట్ట వచ్చునని జోగయ్య సూచించారు. టెంపుల్ టూరిజం, పర్యాటక రంగం, నరసాపురం - కోటిపల్లి రైల్వే లైన్ పూర్తి చేయడంతో పాటు నరసాపురం నుంచి మచిలీపట్నం వరకు కొత్త రైల్వే మార్గం, అంతర్వేది డ్రెడ్జింగ్, హార్బర్, కోనసీమలో పెట్రోలియం అను సంధాన పరిశ్రమలు ఏర్పాటు చేయడం వంటి పలు సూచనలు చేశారు. వశిష్ఠ గోదావరిపై నరసాపురం - సఖినేటి పల్లి వద్ద, కోడేరు - అయోధ్యలంక వంతెనల నిర్మాణాలు, రాజమండ్రి విమానాశ్రయానికి అంతర్జాతీయ స్థాయి కల్పించాలని, అలాగే తాడేపల్లిగూడెంలో కూడా ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టడం, గత ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలను దత్తత తీసుకున్న పవన్ కల్యాణ్ ఈప్రాంత అభివృద్ధికి వెంటనే తన వంతు కృషి ప్రారంభించాలని జోగయ్య సూచించారు. అలాగే గోదావ రి జిల్లాల పరిధిలోని జాతీయ రహదారులను విస్తరించాలని, ఆర్అండ్‌బి రోడ్లను మెరుగు పరచాలని కోరారు.



చిన్నారులతో మంత్రి దీపావళి

దీపావళి పండుగను పాలకొల్లులోని అంజలి మానసిక వికలాంగుల కేంద్రంలోని చిన్నారులతో కలిసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జరుపుకున్నారు. ఆయన భార్య, కుమార్తెలతో కలిసి చిన్నారులకు మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు.

- పాలకొల్లు టౌన్

లక్ష్మీ నారసింహుని సేవలో

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్







దీపం పథకం వాహనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... వేదాశీర్వచనాలు



ఐఎస్ జగన్నాథపురంలో పవన్ పర్యటన

ద్వారకాతిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఉపాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీలక్ష్మీనారసింహ స్వామిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్టీ ఎస్వీ నివృతరావు, ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఆలయ యాగశాలకు వెళ్లి అక్కడ సుదర్శన నృశింహ ధన్వంతరి గరుడ ఆంజనేయ అనంత హోమాన్ని దాదాపు రెండు గంటల సేపు నిర్వహించారు. ఎరుపురంగు వస్త్రంలో ఉంచిన తన కులదేవత ప్రతిమను తెచ్చి ముందుగా ఆలయ ప్రధాన హోమగుండం వద్ద మోకరిల్లారు. అనంతరం హోమంలో పాల్గొని గణపతి పూజ, పుణవాచన, మండపారాధనను పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నిర్వహించి చివరగా పూర్ణాహుతి ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. ఆపై మంత్రజలంతో ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు స్వామి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికి స్వామి చిత్రపటాన్ని ప్రసాదాలను అందజేశారు.

ఆలయం వద్ద ఘన స్వాగతం

తొలుత ఆలయం వద్ద ఆయనకు మంత్రులు కందుల దుర్గేష్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్‌శివ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ సువర్ణరాజు, జడ్పీటీసీ సామ్యూల్, సర్పంచ్ పి.ఏసుబాబు, డి.నరసింహమూర్తి, తదితరులు ఘన స్వాగతం పలికారు.



ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

నూనె డబ్బా రూ.2 వేలకు కొంటున్నా..



15 లీటర్ల నూనె డబ్బా రూ.1400 లకు తెచ్చే వాడిని. ప్రస్తుతం డబ్బా రూ.2 వేలు పెట్టి కొనుగోలు చేస్తున్నా. దీంతో పాటు మిరపకాయలు, టామాటాల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. పెరిగిన ధరల కారణంగా మావంటి చిన్న వ్యాపారస్తులు చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, పాలకులు ధరలను నియంత్రిస్తే బాగుంటుంది.

- సత్యనారాయణరెడ్డి
బజ్జీల వ్యాపారస్తుడు, పెంటపాడు

వంట నూనెలు సలసల



మండిపోతున్న ధరలు.. వినియోగదారుల బెంబేలు

వంటనూనె ధరలు మండిపోతున్నాయి. ధరలు ఆకాశాన్ని చేరుకోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. ఒక్కసారిగా ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. నూనెపై ఆధారపడి వ్యాపారం చేసుకునే చిన్నపాటి తోపుడు బండి వ్యాపారస్తులు ఫెరిగిన నూనెధరలు చూసి ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

- పెంటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి)

ధరల పెరుగుదలకు కారణం..

ధరలు పెరగడానికి అంతర్జాతీయ మార్కెట్ క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గిపోయినట్టుగా కొంతమంది హోల్‌సేల్ వ్యాపారస్తులు తెలుపుతున్నారు. విదేశాల నుంచి ఓడలలో రావాల్సిన వంటనూనె సరైనసమయానికి రాకపోవడమే ధరలు పెరగడానికి కారణమంటున్నారు. వంటనూనె ధరలపై కేంద్ర ప్రభుత్వం 20 శాతం దిగుమతి సుంకాన్ని పెంచడం కూడా పెరుగుదలకు కారణమని కొంతమంది రిటైల్ వ్యాపారస్తులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం పండుగ సీజన్ కావడంతో ఒకేసారి ధరలను అమాంతంగా పెంచేశారని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు నెలల నుంచి నూనె ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ధరలు ఇలా పెరిగిపోతే సామాన్య ప్రజలు ఏం తిని బతకాలంటూ ప్రశ్నిస్తున్నారు.

ధరలు పెరుగుదల ఇలా

గతంలో పామాయిల్ 15 లీటర్ల డబ్బా హోల్‌సేల్‌లో రూ.1350, రిటైల్‌గా రూ.1400 ఉంటే ప్రస్తుతం హోల్‌సేల్‌లో రూ.1900 పలుకుతుంది. రిటైల్ మార్కెట్‌లో రూ.2000 వరకు విక్రయిస్తున్నారు. అదే 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.90 ఉంటే ప్రస్తుతం రూ.135 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఫ్రీడం అయిల్ 15 లీటర్ల డబ్బా గతంలో హోల్‌సేల్‌లో రూ.1550 ఉంటే రిటైల్‌గా రూ. 1600 నుంచి 1650 వరకు అమ్మకాలు జరిపేవారు. ప్రస్తుతం 15 లీటర్ల డబ్బా హోల్‌సేల్‌లోనే రూ.2050 పలుకుతుంది. దీన్ని రిటైల్‌గా రూ.2150 అమ్మకాలు సాగిస్తున్నారు. ఫ్రీడం ఆయిల్ 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.120 ఉంటే ప్రస్తుతం రూ.150 పలుకుతుంది.

- క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గడం వల్లే పెరిగిన ధరలు పెరిగాయంటున్న వ్యాపారస్తులు
- మరోవైపు ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

రైస్ రిచ్ 900 గ్రాముల ప్యాకెట్ ధర గతంలో రూ.120 ఉంటే ప్రస్తుతం రూ.150 వరకు విక్రయాలు సాగిస్తున్నారు.

గ్రామస్థాయిలో ఎవరి ధరలు వారివే

ఇక గ్రామాల్లో బయట మార్కెట్ కంటే మరో రూ.10 అదనంగానే వంటనూనె విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో చిల్లర వ్యాపారాలు సాగుతుంటాయి కాబట్టి వ్యాపారులు ఎవరికి తోచిన రీతిలో వారు ధరలు నిర్ణయించుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఫెరిగిన ధరలను చూసి నోరెళ్ళ బెట్టడం తప్ప వినియోగదారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది

కూరల ధరల భయం

- ఇప్పటికే కొండెక్కిన ధరలు.. నేటి నుంచి కార్తీకమాసం ఎఫెక్ట్

నరసాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో కూరల ధరలకు రెక్కలొస్తాయి. నెల రోజుల పాటు చాలామంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉంటారు. కూరగాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. స్వామిమాలలు వేసుకున్న భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ప్రతి ఏటా ఈనెలలో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. ఈసారి వర్షాల కారణంగా ముందుగానే ధరలు కొండెక్కాయి. శనివారం నుంచి మొదలయ్యే కార్తీకమాసంలో వీటి ధరలు మరింత పెరుగుతాయన్న భయం సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో నెలకొంది. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో కాయగూర సాగుకు ప్రసిద్ధి. బీర, పొట్ల, బెండ, వంగ, దోస, దొండ, సొరకాయలతో పాటు ఆకు కూరలు ఎక్కువగా పండుతాయి. క్యారెట్, టమాట, బీట్‌రూట్, పచ్చి వంటి రకాల ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. ఎక్కడికక్కడ పాట మార్కెట్‌లు ఉన్నాయి. రైతులు పండించిన పంటను మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఈసారి ధరలు ముందుగానే చుక్కలంటాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాకాలంలో వానలు, వరదలొచ్చాయి. ఈ కారణంగా పంటలన్నీ దెబ్బతిన్నాయి. ప్రస్తుతం అన్ని ఇతర జిల్లాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అన్నీ కేజీ రూ.50పైనే పలుకుతున్నాయి. కార్తీకమాసం సీజన్‌లో డిమాండ్‌ను బట్టి ధరలు మరింత పెరుగుతాయన్న వాదనలు మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆకు కూరల కట్ట రూ.30 పలుకుతుంది. కొత్తిమీర రూ.50లేనిది రావడం లేదు. ఉల్లి కేజీ రూ.50 దాటాయి. నరసాపురంలో రైతు బజార్ వ్యాపారి అడ్డాల శ్రీను మాట్లాడుతూ సాధారంగా కార్తీకమాసంలో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం అమ్ముతున్న దాని కంటే ఈనెలలో ఎక్కువగా అమ్ముతాం డిమాండ్‌కు అనుగుణంగా సరుకులు తీసుకొస్తామంటున్నారు.



పైడిచింతపాడులో ఉద్రిక్తం

టీడీపీ, జనసేన నాయకుల మధ్య వర్గవిభేదాలు

పింఛన్ల పంపిణీ సందర్భంగా పరస్పర దాడులు

ఏలూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం పైడి చింతపాడులో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వర్గవిభేదాలు తారస్థాయికి చేరాయి. పైడిచింతపాడులో గురువారం ఉదయం సామాజిక పింఛన్ పంపిణీలో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య వివాదం రేగింది. ఇదికాస్త చినికి చినికి గాలివానలా మారి కొట్లాటకు దారితీసింది. కొట్లాటలో ఇరువర్గాల నాయకులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు.



పైడిచింతపాడులో టీడీపీ – జనసేన నాయకుల ఘర్షణ

గ్రామంలో గురువారం ఉదయం టీడీపీ నాయకులు దగ్గరుండి పింఛన్‌లు అందించేందుకు పూనుకున్నారు. ఈ విషయం ఇటీవల వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి వచ్చిన నాయకులు తమకు సమాచారం అందించకుండా పింఛన్లు ఏ విధంగా పంపిణీ చేస్తారంటూ టీడీపీ నాయకులను ప్రశ్నించారు. మీకు చెప్పాల్సిన పని లేదంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య తోపులాటకు దారితీసింది. వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన నాటి నుంచి గతనెల కూడా పింఛన్ పంపిణీ విషయంలో ఆధిపత్య పోరు నడిచింది. అక్టోబరు ఒకటో తేదీన సైతం ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. తిరిగి అదే విషయంపై పునరావృతమైంది. ఇరువర్గాల నాయకులు సచివాలయం బయటకు వచ్చి కొట్లాడుకున్నారు. గ్రామంలో టీడీపీ నేతల ఆగడాలు పెరిగిపోయాయంటూ జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీమూకలతో జనసేనలో చేరి పెత్తనం చెలాయిస్తే ఊరుకోమని టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్‌పికెట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం ఏలూరు ఎంపీడీవో శ్రీలత అక్కడకు చేరుకుని సచివాలయ సిబ్బంది చేత పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ -జనసేన మధ్య పరస్పర దాడులు ఇరువర్గాల నేతల మధ్య పొత్తుధర్మం లేకపోవడంపై ఆయా పార్టీ నాయకులు అధినేతలకు ఫిర్యాదు చేసేందుకు సమాయత్తం అయ్యారు.

11 మందిపై కేసు..

ఏలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సైదు నాగరాజు ఫిర్యాదు మేరకు జనసేన నాయకులైన ముంగర వెంకటేశ్వరరావు, మురార్జీ, రాంపండు, రంగబాబు తదితరులు మొత్తం పదకొండు మందిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సైదు నాగరాజును దెందులూరు ఎమెమల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు.

క్రైమ్ కార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శివన్నారాయణ (ఫైల్)

పెదవేగి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ రోజున ఆ ఇంటిలో విషాదం నెలకొంది. సాగు నష్టాలను అధిగ మించలేక ఆ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదురోజులపాటు మృత్యువుతో పోరాడి చివరకు అసువులు బాసాడు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరా లివి.. వంగూరుకు చెందిన మేకా శివన్నారాయణ (32) రెండున్నర ఎకరాలలో మిర్చి, వరి సాగు చేశాడు. వరుసగా నష్టాలు రావడంతో అప్పులపా లయ్యాడు. మనస్తాపానికి గురైన గత నెల 27న పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తొలుత ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అనంతరం విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆయనకు భార్య సుధారాణి, ఇద్దరు కుమార్తెలు, రెండేళ్ళ కుమారుడు ఉన్నారు.

తణుకులో ఒకరి హత్య

తణుకు : తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం అర్ధరాత్రి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. తణుకు సజ్జాపురానికి చెందిన కాకర్ల దుర్గారా వు(35)గా పోలీసులు గుర్తించారు. స్కూ లు ప్రాంగణంలో గురువారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి నిర్దేశిత సమయంలో పోలీసులు షాపులు మూయించి వేసిన తర్వాత కారణం తెలియదు కాని ఇరువురి మధ్య ఘర్ష ణలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం కొంతమంది వాకర్స్ వాకింగ్‌కు వచ్చిన పుడు చనిపోయిన వ్యక్తిని గమనించి పోలీసులు సమాచారం అందించారు. డీఎస్పీ విశ్వనాథ్, సీఐ కొండయ్య, పోలీసులతో పాటు క్లూస్ టీము, డాగ్ స్క్వాడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అతడి భార్య అలివేలు మంగతో పదేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు.మృతదేహంపై గాయాలు ఉన్నందున హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

భార్య,కుమార్తెలపై ఆధారపడి బతకలేక ఒకరు..

పాలకోడేరు : జీవితంపై విరక్తితో భార్య, కుమార్తెలపై ఆధారపడి బతకలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఆత్మహత్యకు పాల్పడిన సికిలే గిద్యోని (56)మృతి చెందిన ఘటన శుక్రవారం గరగపర్రులో జరిగింది. పాలకోడేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సికిలే గిద్యోని కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భార్య కేథరిన్, కుమార్తె శారమ్మలపై ఆధారపడి జీవించలేక శుక్రవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయన్ని భీమవరంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

ఏలూరులో ఉల్లి బాంబుల పేలుడు

ఒక యువకుడి మృతి 8 మందికి తీవ్ర గాయాలు



ధ్వంసమైన బైక్

ఏలూరు ప్రభుత్వ ఆపపత్రిలో క్షతగాత్రులు

ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిషోర్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గురు, శుక్రవారాల్లో మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. ఏలూరు నగరంలో ఉల్లిపాయ బాంబులు పేలడంతో ఒకరు మృతి చెందారు. పెదవేగి మండలం వంగూరులో రైతు ఆత్మహత్యకు పాల్పడగా, తణుకులో ఒకరు హత్యకు గురయ్యారు. మరో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పాలకోడేరు మండలంలో ఒకరు.. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో మరొకరు.. పెనుమంట్ర మండలంలో లారీ డ్రైవర్, ఏలూరులో వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందారు.

ఏలూరు టూటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున గురువారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఏలూరు వన్‌టౌన్‌లో ఆకస్మాత్తుగా పేలుడు సంభవించడంతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇద్దరు యువకులు ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో సర్దుకుని స్కూటర్‌పై వెళ్తుండగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా ఒక యువకుడితో పాటు మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. ఏలూరు సత్యనారాయణ పేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తాబేలు సాయిరామ్ అతడి స్నేహితుడు ఏలూరు మారుతీనగర్‌కు చెందిన పూల కొట్టులో పని చేసే దుర్గాసి సుధాకర్(28) కలిసి ఏలూరు మాదేపల్లి రోడ్డులోని కబేళప్రాంత సమీపం నుంచి ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో వేసుకుని స్కూటర్‌పై సత్యనారాయణపేట వెళ్తున్నారు. మార్గమధ్యలో తూర్పువీధి గౌరమ్మ గుడి వద్ద ఆకస్మాత్తుగా ఉల్లిపాయబాంబులు పేలడంతో పెద్ద విస్పోటం సంబవించింది. సుధాకర్ రెండు ముక్కలైపోయాడు. అతడి ఎడమకాలు రెండుమీటర్ల దూరంలోని మూడంతస్తుల భవనంపై పడగా కుడికాలు పక్కనే ఉన్న భవనంపై పడింది. గౌరమ్మ గుడి ఎదురుగా నిలబడి మాట్లాడుకుంటున్న ఏడుగురు యువకులైన అదే ప్రాంతానికి చెందిన కె.శ్రీనివాసరావు, ఎస్‌కే.ఖాదర్, మళ్ళా పెద్దిరాజు, సువ్వారి శశి, మెడికల్ షాపు సురేష్, బొడ్డేటి సతీష్‌కుమార్, సువ్వారి సత్యనారాయణ తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌కే.మదీనబాషా వారి వద్దకు చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆర్తనాదాలు

క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో కాలిన గాయాలతో ఉన్నవారు పెట్టిన కేకలు వర్ణనాతీతం. వారి కేకలు విన్న బంధువులు తల్లడిల్లిపోయారు. వారి రోదనలతో ఆసుపత్రి వద్ద ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రసాదరెడ్డి, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ మల్లికార్జున రాజు, డాక్టర్ కుమార్ పలువురు వైద్యులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యసేవలందించారు. తాబేలు సాయిరామ్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అతడిని విజయవాడ తరలించారు. సురేష్, సతీష్‌కుమార్, సత్యనారాయణలను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఘటన స్థలంలో ఎస్పీ పరిశీలన

ఉల్లిపాయ బాంబుల పేలిన ప్రమాద సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ కేపీఎస్.కిషోర్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, జిల్లా క్లూస్ టీమ్ బృందాలు, విజయవాడ ఫోరెన్సిక్ బృందాలు పరిశీలించారు. సంఘటన స్థలంలో పలు ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ ఉల్లిపాయ బాంబులు ఎక్కడ నుంచి తీసుకువచ్చారన్న దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. క్షతగాత్రులను ఎస్పీ కిషోర్ పరామర్శించారు.

రైలు కిందపడి యువకుడు..

తణుకు : తణుకు పట్టణానికి చెందిన యువకుడు శుక్రవారం తెల్లవారుజామున రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక గౌతమి సాల్వెంట్ పరిశ్ర మ సమీంలోని రైలు కింద పడినట్లు చెబుతు న్నారు. తణుకు పాతూరుకు చెందిన సిద్దు(22)గా గుర్తించారు. తణుకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని మరొకరు..

తాడేపల్లిగూడెం రూరల్ : రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆరుగొలనులో శుక్రవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆరుగొలనుకు చెందిన బి.శ్రీను(48) కూలిపని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం బహిర్భూమికి రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి రైలు వస్తున్నట్టు గమనించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి



రవికుమార్ (ఫైల్)

పెనుమంట్ర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు గ్రామంలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ పులిదిండి రవికుమార్ (41) అనుమానాస్పదంగా మృతి చెందినట్టు పెనుమంట్ర ఎస్‌ఐ స్వామి తెలిపారు. వివరాలిలా.. మూడేళ్లుగా లారీ డ్రైవర్ రవికుమార్ మార్టేరులో నివాసముం టున్నారని గురువారం రాత్రి అతడు ఉంటున్న అద్దె ఇంటిలో చనిపోయిన విషయం పక్కింటి వారు చూసి పోలీసులకు సమాచారం అందిం చారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిస అయ్యారని స్థానికులు వెల్లడిం చారు. అతడు మరణించాడని బంధువులకు సమాచారం అందించి, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు

ఏలూరుక్రైం :ఓ వృద్ధురాలు గుండెపోటుతో మరణించగా ఆ వృద్ధురాలికి అప్పు ఇచ్చిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఏలూరు గణేశ్‌నగర్ కాలనీకి చెందిన పి.రమణమ్మ(64) ఇంటిలో ఒంటరిగా జీవిస్తుండగా అ పక్కనే మనుమరాలు పావని జీవిస్తుంది. రమణమ్మ గురువారం రాత్రి గుండెపోటుతో మరణించింది. రమణమ్మకు డబ్బులు అప్పిచ్చిన కొండపల్లి దుర్గ 112 నంబరుకు కాల్ చేసి రమణమ్మను ఆమె మనుమరాలు పావని కొట్టడంతో మరణించిందంటూ సమాచారమిచ్చింది. ఏలూరు రూరల్ ఎస్‌ఐ సీహెచ్.దుర్గాప్రసాద్ శుక్రవారం ఉదయం సిబ్బందితో వెళ్ళి పరిశీలించి, అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపించారు. ఆమె గుండెపోటు వల్ల మరణించిందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్చురీలో మృతదేహం మాయంపై కేసు

ఏలూరుక్రైం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహం మాయమైన ఘటనపై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు ఏలూరుటూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన మార్చురీ అసిస్టెంట్ అశోక్ గతనెల 8వ తేదీ రాత్రి డ్యూటీలో ఉన్న మరో మహిళా మార్చురీ అసిస్టెంట్ వద్ద నుంచి మార్చురీ తాళాలు తీసుకుని ఓ మృతదేహాన్ని అంబులెన్స్‌లో వేసుకుని తీసుకెళ్ళాడు. ఈ విషయాన్ని గమనించిన ఆ మహిళా ఉద్యోగి గొడవ చేయడంతో కొంత సమయం తరువాత మళ్లీ తీసుకువచ్చి పెట్టేశాడు. ఈ ఘటనపై ఇప్పటికే ఆ మహిళా ఉద్యోగి ఫోరెన్సిక్ విభాగం ఇన్‌చార్జ్ అయిన డాక్టర్ భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా ఈ ఘటనపై విచారణ చేశారు. ఇక్కడ నుంచి అనేక అనాథ మృతదేహాలు ఇతర రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీలకు విక్రయించారని ప్రాథమికంగా నిర్ధారణ చేశారు. డాక్టర్ సుధాకర్ ఫిర్యాదు మేరకు అశోక్‌పై సీఐ వైవీ.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఉంగుటూరు : వెనుక నుంచి మోటారు సైక్లిస్టును ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలన ఘటన జాతీయ రహదారిపై నారాయణపురం వద్ద జరిగింది. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన మల్లపురెడ్డి కనకదుర్గారావు భీమడోలు మండలం పూళ్ళలోని అత్తారింటికి వెళ్ళి బియ్యం మూటతో బైక్‌పై తిరిగి తన స్వగ్రామం వస్తుండగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. గాయప డిన వ్యక్తిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును చేబ్రోలు పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

చిన వెంకన్నకు దేవదాయ కమిషనర్ పూజలు

ద్వారకాతిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో అర్చకుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం బంగారువాకిలి మీదుగా లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు. అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేదాశీర్వచనం అందించారు. ఈవో ఎన్వీఎస్ఎన్‌మూర్తి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు.



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న కమిషనర్ సత్యనారాయణ

లోకాయుక్తకు ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగుల వివరాలు

ఏలూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో డీఎస్సీ-2002 నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన వారిలో కొందరు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఎంపీహెచ్‌ఏ-మేల్) నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణలో లబ్ధిపొందారనే ఫిర్యాదుమేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగుల అన్ని సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంట్ల కలర్ జిరాక్స్ కాపీల సెట్లను లోకాయుక్త ఆదేశాలపై జిల్లా అధికారులు పంపించారు. అనంతపురం జిల్లాలో ఒకరు లోకాయుక్తను ఆశ్రయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి ఈ సమాచారాన్ని కోరారని స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 205 మంది ఎంపీహెచ్‌ఏ-మేల్ ఉద్యోగులుగా నియమితులైనట్టు తెలిసింది. లోకాయుక్త ఉమ్మడి జిల్లా నుంచి సమాచారం కోరిన విషయాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ ధ్రువీకరించారు. లోకాయుక్త ఆదేశాల మేరకు సమాచారాన్ని పంపామని, ఇతర వివరాలు చెప్పలేనన్నారు.

మున్సిపల్ టీచర్ల పదోన్నతులపై కసరత్తు

ఏలూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని ఏలూరు కార్పొరేషన్, మరో ఏడు పురపాలక సంఘాల పాఠశాలల టీచర్లకు పదోన్నతులు ఇచ్చేందుకు కసరత్తును వేగవంతం చేశారు. ఆయా మున్సిపాల్టీల వారీగా టీచర్ల సీనియార్టీ జాబితాలను ఇప్పటికే జిల్లా వెబ్ సైట్‌లో పొందుపర్చి, వాటిపై అభ్యంతరాల ను కోరారు. శుక్రవారం గడువు ముగిసే సరికి తొమ్మిది అభ్యంతరాలు అందాయి. వీటిని పరిష్కరించిన అనంతరం ఈనెల 4న తుది సీనియార్టీ జాబితాలను విడుదల చేసి, ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు నిర్ధారిం చిన పోస్టులను పదోన్నతి ద్వారా ఆరో తేదీన భర్తీ చేయాలని భావిస్తున్నారు. కొత్త డీఈవోగా నియమితులైన వెంకటలక్ష్మమ్మ శుక్రవారం జిల్లాలో బాధ్యతలు చేపట్టక పోవడంతో కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో కేడర్, సబ్జెక్టుల వారీగా వేకెన్సీల వివరాలు, సంఖ్యలను తుదిగా నిర్ధారించ డానికి ఒకింత జాప్యం జరుగుతోంది.

నా అంత్యక్రియలు పుట్టింటి పేరుతోనే..

- సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకున్న వివాహిత



ప్రత్యూష(ఫైల్)

రాజమహేంద్రవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెళ్లయిన 70 రోజులకే బలవంతంగా ఓ వివాహిత ప్రాణాలు తీసుకోవడంతో.. దీపావళి రోజున ఆ ఇంట్లో చీకట్లు అలుముకున్న ఘటన రాజమహేంద్రవరంలో జరిగింది. కంబాల చెరువు సమీపంలోని లోలుగు అపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టరుగా జీవనం సాగిస్తూ అమలకంటి వెంకట ప్రసాద్ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె ప్రత్యూష(26)కు ఈ ఏడాది ఆగస్టు 22న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కత్తి నాగసత్యశ్రీనివాసరావు కుమారుడు వంశీ రాధాకృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. చెన్నైలోని చెన్నై పెట్రో కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో రాధాకృష్ణ చార్టర్డ్ ఎక్కౌంటెంట్‌గా పని చేస్తున్నారు. పెళ్లయిన రెండు రోజులు ఇద్దరూ పాలకొల్లులో ఉన్నారు. తర్వాత అతడు చెన్నై వెళ్లిపోగా అబ్బాయి తల్లిదండ్రులు, ప్రత్యూష తల్లిందండ్రులు ఈమెను తీసుకెళ్లి చెన్నైలో దిగబెట్టారు. వారం తర్వాత ప్రత్యూషను రాధాకృష్ణ తీసుకొచ్చి తమ ఇంటి వద్ద దించేసి వెళ్లిపోయాడని ఫిర్యాదులో ప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో తమ కూతురిని విచారించగా తన బాధలు చెప్పుకుంటూ కన్నీటి పర్యంతమైందన్నారు. 'హోమియోపతి మెడిసిన్ డిస్‌కంటిన్యూ చేసిన నన్ను ఉద్యోగం చేయాలని బలవంతం చేస్తున్నారు. ఉద్యోగం చేస్తావనే నిన్ను చేసుకున్నాం. రూ.3 కోట్లు కట్నం ఇస్తానన్న సంబంధాలు వదులుకున్నాం. పెళ్లి సమయంలో మీ వాళ్లు ఇస్తానన్న స్థలం అమ్మేసి డబ్బులు తీసుకురా. చెన్నైలో ఫ్లాట్ కొంటాం' అని మానసికంగా వేధిస్తున్నారని చెప్పిందన్నారు. పెళ్లి సమయంలో రూ.5లక్షల కట్నం ఇవ్వడంతోపాటు 15 కాసుల బంగారం పెట్టా మన్నారు. వినాయక చవితి, దసరాకు రమ్మ న్నా ఏదోక సాకు చెప్పే వాడని తెలిపారు. తమ అమ్మాయి భర్తకు ఫోన్ చేస్తే మాట్లాడేవాడు కాదన్నారు. పెళ్లయిన రెండు నెలలకే తన సంసారం ఇలా కావడంతో మానసికంగా కుంగిపోయిందన్నారు. తనకు గుండెపోటు రావడంతో చికిత్స జరిగిందని అప్పటి నుంచీ ఇంటి దగ్గరే ఉండడంతో తాము నచ్చజెబుతూ వచ్చామన్నారు. దీపావళి ముందు రోజున బుధవారం రాత్రి తీవ్రంగా ఏడ్చిందన్నారు. 11గంటల సమయంలో తన గదిలోకి వెళ్లిపోయిందని చెప్పారు. దీపావళి రోజున ఉదయం తన భార్య నాగమణి గది తుడవడం కోసం వెళ్లి చూడగా చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకున్న స్థితిలో ప్రత్యూష ఉందన్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. తన కూతురు మరణానికి భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియ వేధింపులే కారణమని ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు.

- పుట్టింటి పేరుతోనే..

ప్రత్యూష రాసినట్టు భావిస్తున్న మరణ వాంగ్మూలం లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దానిలో తన అంత్యక్రియలు అత్తవారింటి పేరుతో చేయవద్దని, పుట్టింటి పేరుతోనే చేయాలని పేర్కొనడం చూస్తే ఎంత వేదనకు గురైందోనని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. కేసును సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్ బాబు దర్యాప్తు చేస్తున్నారు. భర్త రాధాకృష్ణ, మామ నాగ సత్య శ్రీనివాస్, అత్త పద్మప్రియలను అరెస్టు చేశారు. శనివారం కోర్టులో హాజరు పరచనున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం


సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పార్థసారథి

మంత్రి పార్థసారథి పరామర్శ

ఏలూరు టూటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగరోజు బాంబు పేలుడులో మృతి చెందిన సుధాకర్ కుటుంబ సభ్యులను మంత్రి పార్థసారధి, ఎమ్మెల్యే బడేటి చంటి శుక్రవారం పరామర్శించారు. సుధాకర్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సుధాకర్ భార్యకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామన్నారు. టీడీపీ నుంచి రూ.లక్ష, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సుధాకర్‌కు అందాల్సిన రూ.2 లక్షలు తక్షణమే అందిస్తామన్నారు. గురువారం వన్ టౌన్‌లో స్కూటీపై ఉల్లిపాయ బాంబుల మూటను తరలిస్తుండగా పేలుడు సంభవించడంతో సుధాకర్ మృతి చెందాడు. స్కూటర్ నడుపుతున్న మరో వ్యక్తితో సహా ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే చంటి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సుధాకర్ అంత్యక్రియలకు ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్ రూ.15వేలు అందజేశారు. క్షతగాత్రులకు రూ.20వేలు ఆర్థిక సహాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఆర్డీవో అచ్యుత అంబరీష్, తహసీల్దార్ శేషగిరి, కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎస్ఎంఆర్.పెదబాబు, జాలా బాలాజీ, ఉన్నారు.

టీటీడీ బోర్డులో నాయీబ్రాహ్మణులకు ప్రాతినిధ్యంపై హర్షం


ప్రగడవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

చింతలపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం ప్రగడవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ సాధికారత కమిటీ జిల్లా అధ్యక్షుడు కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లోనే ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలు జీతం ప్రకటించడం, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నాయీ బ్రాహ్మణ సంఘం నేత వైద్యం శాంతారామ్‌ను తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీసీలకు ప్రభుత్వం మరింత అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీను, సత్యనారాయణ, పుల్లారావు, వెంకటేశ్వరరావు, త్యాగరాజు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా వి.శాంతరామ్‌ను నియమించడంపై ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందనాడ నందీశ్వ రరావు హర్షం వ్యక్తం చేశారు. నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి ఇది గౌరవం అన్నారు. శాంతరామ్‌ను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నందీశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వారికి కరెంటు చార్జీలు మినహాయించాలన్నారు. 50 ఏళ్లు నిండిన నాయీబ్రాహ్మణులకు రూ.4వేలు పింఛన్ అందజేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలన్నారు.

నూతన వంగడాలతో అధిక దిగుబడులు


వరిచేను పరిశీలిస్తున్న ఎన్జీ రంగా వర్సిటీ డైరెక్టర్

లింగపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు నూతన వంగడాలతో అధిక దిగుబడులు సాధించాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ సంచాలకుడు జి.శివన్నారాయణ అన్నారు. మండలంలో వరి చేలను శుక్రవారం పరిశీలించారు. ఏలూరు ఏరువాక కేంద్రం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఎంటీయూ 1310 విత్తన ప్రథమశ్రేణి ప్రదర్శనా కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సొంతంగా విత్తనాలను తయారు చేసుకుంటే అధిక దిగుబడులు, లాభాలు సాధించవచ్చన్నారు. నూతన వంగడాలను సృషించి లాభాలు పొందవచ్చన్నారు. అనంతరం రైతుసేవా కేంద్రాన్ని పరిశీలించి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న రైతు సంబంధిత పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఏవో మురళీ కృష్ణ, శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్, ఎన్. నాగేంద్ర బాబు, ఆర్‌బీకే సిబ్బంది నాని, గణేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ ప్రసాద్

పెదవేగి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు, జూదం నిర్వహించే వారిని గుర్తిస్తున్నామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీషీట్ తెరుస్తామని నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీప్రసాద్ తెలిపారు. బాణసంచా దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పెదవేగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో కోడిపందేలు, పేకాట ఎక్కువగా జరుగుతాయనే సమాచారం వచ్చిందని, కోడిపందేల నిర్వాహకులపై నిఘా ఉంచామన్నారు. పందేల నిర్వహణ నిలిపివేయాలని చెబుతామమని, ఉల్లంఘిస్తే వారిపై రౌడీషీట్ తెరుస్తామని ఆయన హెచ్చరించారు. జూదం అనర్థాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న పాలకవర్గ ప్రతినిధులు

ఏలూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఆర్ఆర్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. గుత్తా శ్రీరామారావు ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్, కలగర వెంకటరత్నం - మహ్మద్ అస్లామ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ కం నీడ్ అవార్డులను, ఉపకార వేతనాలను, స్వర్ణ పతకాలను అందజే శారు. అటానమస్ కళాశాల విద్యార్థులు 12 మందికి, మహిళా కళాశాల విద్యార్థి నులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థు లకు బహుమతులు అందజేసినట్టు సీ ఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్ తెలిపారు. పాలకవర్గ కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, సభ్యులు కా నాల శ్రీనివాసరావు, వేమా కోటేశ్వరరావు, కాకరాల రాజేంద్రవరప్రసాదరావు, ప్రిన్సిపాల్ రామరాజు, విశ్వేశ్వరరావు, సరళ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్

లింగపాలెం: ధర్మాజీగూడెం బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలకు పెద్దిబొట్ల కిరణ్ కుమార్ వాటర్ ట్యాంక్ అందజేశారు. పాఠశాలలో చదువుతున్న ఆయన కుమార్తె పెద్దిబొట్ల శ్యామల తాగునీటి ఇబ్బందులు ఆయనకు చెప్పడంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను విరాళంగా అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.కుటుంబరావు విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను అభినందించారు.

కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నిరంతర పోరాటం


ఏలూరులో ఏఐటీయూసీ నాయకుల నినాదాలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని సీపీఐ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షత వహించారు. కూరెళ్ళ వరప్రసాద్, బండి వెంకటేశ్వరరావు, తెర్లాపు శ్రీను, ఉప్పులూరి రావు, కె.మూర్తి, హరినారాయణ, మహబూబ్ షరీఫ్, శ్రీధర్, రాము, కిశోర్ పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: కార్మిక లోకాన్ని ఏకం చేసి వారికి భరోసాగా నిలిచిన ఘన చరిత్ర ఏఐటీయూసీకి ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాను కుంచే వసంతరావు, మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూన పాముల విఘ్నేష్, ఏరియా ఆసుపత్రి వద్ద మన్నవ కృష్ణ చైతన్య ఎగురవేశారు. జేవీ.రమణ, గొలిమే బాలఏసు, చందా త్రిమూర్తులు, బొక్కా శ్రీను, కంతేటి వెంకట్రావు, సుబ్రహ్మణ్యం, ముప్పి డి శ్రీను, సంజీవ్, చంద్రకళ, దయామణి తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండలంలోని మక్కిన వారిగూడెంలో ముఠా వర్కర్స్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కాళహస్తి సుబ్బారావు సంఘ జెండా ఆవిష్కరించారు. టీవీఎస్ రాజు మాట్లాడుతూ 105 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఏకైక కార్మిక సంస్థ ఏఐటీయూసీ అన్నారు. కార్మిక శక్తులంతా ఏకమై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకించాలన్నారు. కొండముచ్చు శ్రీనివాసరావు, మల్లెల సత్యనారాయణ, బైగాని ఏకాంబరం పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సీపీఐ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ చోడెం దుర్గ జెండా ఎగురవేశారు. కార్మికుల తరపున పోరాటాలు చేసి విజయం సాధించిన ఘనత ఏఐటీయూసీకి ఉందన్నారు. కార్యక్రమంలో బేతి కిశోర్, బుద్దుల ముత్యాలమ్మ, సూర్యచంద్రం, పి.మంగారావు, కృష్ణ, శ్రీనివాస్, రమణ, మోహన్, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడి


ఏలూరు నగరంలో ముస్తాబైన ఆలయం

- ఆలయాలు ముస్తాబు
- నేటి నుంచి ప్రత్యేక పూజలు
- శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలో శివాలయాలను ముస్తాబు చేశారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేసి తాత్కాలిక పందిర్లు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తుల ప్రవేశానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్తీక మాసంలో ఆలయాల వద్ద పూజలు, అభిషేకాలు, దీపోత్సవం చేయడం పరిపాటి. శివభక్తులు, విష్ణు భక్తులు కూడా పూజలు, అభిషేకాలు, బిల్వార్చనకు సంసిద్ధమయ్యారు. నగరంలోని జరాపహరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేట, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురం కాశీ విశ్వేశ్వరాలయం, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరి ఆలయం, దుర్గామల్లేశ్వరి ఆలయం, ఆదివారపుపేటలోని రామలింగేశ్వర ఆలయాలు కార్తీక మాస పూజలకు సిద్ధమయ్యాయి. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

● కామవరపుకోట: మండలంలో శివాలయాలు కార్తీక పూజలకు సిద్ధం చేశారు. కామవరపుకోట భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం, ఆడమిల్లి కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయం, తడికలపూడి గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి, జీలకర్రగూడెం ధర్మలింగేశ్వరస్వామి, రావికంపాడు, వెంకటాపురం, రామన్నపాలెం, ఉప్పలపాడు తదితర గ్రామాల్లోని శివాలయలన్నీ కార్తీక పూజలకు సిద్ధమయ్యాయి. ఆడమిల్లిలోని మందా సమేత శనీశ్వర స్వామి ఆలయం వద్ద అభిషేకాలు, రుద్రాభిషేకాలకు ఏర్పాట్లు చేశారు.

నేడు లక్ష దీపార్చన

● జంగారెడ్డిగూడెం: దాస కోలాట భజన మండలి ఆధ్వర్యంలో శనివారం లక్ష దీపార్చన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. దాస సాహితీ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి అనంత తీర్థాచార్య హాజరు కానున్నారు.





ఏలూరు, దెందులూరు, నిడమర్రులో గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని, కొయ్యలగూడెంలో అందిస్తున్న బొరగం శ్రీనివాస్

వంట గదిలో దీపం

లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ అందజేసిన మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యేలు


చింతలపూడిలో గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న మంత్రి పార్థసారథి

చింతలపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల వంట గదిలో ప్రభుత్వం 'దీపం' వెలిగించింది. దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను మంత్రి కొలుసు పార్థసారధి శుక్రవారం పంపిణీ చేశారు. చింతలపూడిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేసే కార్యక్రమంలో ఈ పథకం అమలు చేశామన్నారు. కూటమికి 164 సీట్లు అప్పగించి ప్రజలు పెద్ద బాధ్యత ఇచ్చారన్నారు. పిల్లల భవిష్యత్ కోసం మహిళలు ఆలోచన చేసి తమను నమ్మారని, కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో చేపట్టబోయే ఐదు నీటి ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా ఉందన్నారు. ఈ పథకానికి గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో కొత్త రోడ్లకు రూ.6 కోట్లు కేటాయించామని, ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అభ్యర్థన మేరకు తాను రూ.కోటి ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రతీ కుటుంబం తలసరి ఆదాయం పెరగాలని, చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిధులు అధికంగా కేటాయించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి మాట్లాడారు. ఆర్డీవో వాణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి చంద్రశేషు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జగ్గవరపు ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్-6 పథకాల్లో ఒకటైన ఉచిత గ్యాస్ ఎమ్మెల్యే బడేటి చంటి పంపిణీ చేశారు. శివగోపాలపురం గంగానమ్మ ఆలయం వద్ద ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఎమ్మెల్యే మహిళలకు శుక్రవారం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి అన్నారు. దీపావళి నాడు పేదల ఇళ్లలో గ్యాస్‌సిలిండర్ల పథకంతో వెలుగు నింపుతున్నామన్నారు. నియోజకవర్గంలో 61,853 మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు. సంవత్సరానికి 3గ్యాస్‌సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ జీవీ.శేషగిరి, డీటీ రమేష్‌కుమార్, ఎస్ఎంఆర్.పెదబాబు, కార్పొరేట ర్లు పప్పు ఉమామహేశ్వరరావు, నున్నా స్వాతి, ఆర్నేపల్లి తిరుపతి, బొద్దాని శ్రీనివాస్, మారం హనుమంతరావు, వందనాల శ్రీనివాసరావు, నున్నా కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరులో ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆయన పంపిణీ చేశారు. పథకాన్ని ప్రారంభించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ ఉన్నవారందరికీ దీపం పథకలో ఏడాదికి మూడు గ్యాస్ బండలను అందిస్తామన్నారు. సంక్రాంతి నాటికి దెందులూరు-పంగిడిగూడెం రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు జాతీయ రహదారి నుండి ఉండ్రావరం రోడ్డు, కొవ్వలిలో పుంతల ముసలమ్మ రోడ్డు సైతం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, గారపాటి కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తోట ఏసమ్మ, ఎంపీటీసీ శేషారత్నం, మోతుకూరి నాని, కలపాల చంద్రశేఖర్, పెనుబోయిన మహేష్ యాదవ్, పసుమర్తి మధుబాబు, నాగనబోయిన సత్యనారాయణ, బొడ్డేటి మోహన్‌బాబు, నున్న లక్ష్మణ్. అధికారులు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీదేవి, సర్పంచ్ ఏసమ్మ, తాతా సత్యనారాయణ, బొప్పన సుధ, తదితరులతో కలిసి వెలమపేటలో చింతమనేని ప్రభాకర్ గ్యాస్ బండలను పంపిణీ చేశారు.

● కొయ్యలగూడెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. దీపం పథకంలో అందజేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లను కొయ్యలగూడెంలో ఆయన పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామారావు, తెలుగు మహిళ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, బెల్లాని శ్రీను, గొలిశెట్టి శ్రీను ఉన్నారు.

● కుక్కునూరు: కూటమి ప్రభుత్వం దీపావళి రోజున అమలులోకి తీసుకొచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ దీపం పథకాన్ని గురువారం కుక్కునూరులో ప్రారంభించారు. మహిళా లబ్ధిదారులు భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, ఎం.వెంకటరమణ, చుంచు సత్యనారాయణ, ఎం.యుగంధర్, వీ.లక్ష్మణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు: ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ ద్వారా మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకొందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. నిడమర్రులో లబ్ధిదారులకు శుక్రవారం గ్యాస్ సిలిండర్లు అందజేశారు. జనసేన నాయకులు వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ఏలూరు టూటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం 6గంటలకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తూర్పువీధిలో ఎమ్మెల్యే బడేటి చంటి పింఛన్లు పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, ఎస్ఎంఆర్.పెదబాబు, ఎన్.జ్యోతికుమార్, మారం హనుమంతరావు, చోడే బాలు, శ్రీకాంత్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి పెన్షన్ల పంపిణీ చేశారు. గరిమళ్ల చలపతిరావు, గారపాటి బుజ్జయ్య, మునునూరి రాము, మోరంపూడి మల్లికార్జునరావు, మోరంపూడి ప్రసాద్, గారపాటి సాయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం జోరుగా సాగింది. ఎంపీడీవో ఇ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం, ఎల్ఎన్‌డీ.పేట, ఇటుకలకోట, వింజరం, కొండ్రుకోటలో పింఛన్లు అందజేశారు.

● ఉంగుటూరు: మండలంలో 11500లకు గాను 10808 పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్ తెలిపారు. ఉదయం కొంతసేపు సర్వర్ పనిచేయకపోక పోవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారన్నారు.

యువకుడి హల్‌చల్

అదుపులోకి తీసుకున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్లో శుక్రవారం రాత్రి యువకుడు హల్‌చల్ చేశాడు. ప్రేమించిన యువతితో రోడ్డుపై గొడవ పడుతుండగా స్థానిక యువకులు, యువతి బంధువులు అడ్డుకున్నారు. ఆ యువకుడు వారిపై దురుసుగా ప్రవర్తించి గొడవ పెట్టుకున్నాడు. రోడ్డుపై గొడవతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై జబీర్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గొడవకు కారణమైన యువకుడు తగరం యువరాజు చంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ఇరువర్గాల గొడవ

పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో గురువారం రాత్రి దీపావళి రోజున బాణసంచా విషయంలో ఇరు వర్గాల వారు గొడవ పడ్డారు. సుమారు వంద మందికి పైగా రోడ్డుపై వీరంగం సృష్టించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి ఇరువర్గాల వారిని చెదరగొట్టినట్లు తెలిసింది.

పొట్టి శ్రీరాములును మరిచారు!

ఏలూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కనీసం పూలమాల వేసి స్మరించకపోవడంపై మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎక్స్ వేదికగా స్మరించుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పొట్టి శ్రీరాములు జయంతిని విస్మరించడం ఆర్యవైశ్యులను తీవ్రంగా కలచివేసిందన్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సత్కారం



ఉప ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు తొలిసారి వచ్చిన పవన్‌కల్యాణ్‌కు మంత్రి కొలుసు పార్థసారథి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పాల్గొన్నారు. - ద్వారకాతిరుమల

ఉచిత విద్యుత్ సబ్సిడీ సక్రమంగా అమలుచేయాలి


సబ్సిడీపై విద్యుత్ ఇవ్వాలని దళితుల నినాదాలు

బుట్టాయగూడెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలకు ఉచిత విద్యుత్ సబ్సిడీ సక్రమంగా అమలు చేయాలని, మండలంలో పేదల ఇళ్లకు ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి డిమాండ్ చేశారు. బుట్టాయగూడెం, రెడ్డి గణపవరం ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు తొలగించిన దళితుల ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అమాయక దళిత, గిరిజనులను బెదిరించి అక్రమంగా విద్యుత్ బిల్లులు కట్టిస్తున్నారని, ఇక్కడ విద్యుత్ అధికారుల అరాచకాలను రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. తొలగించిన మీటర్లు వెంటనే అమర్చి విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. రెడ్డిగణపవరంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద దళితులతో కలిసి ఆందోళన చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అందుగుల ప్రాన్సిస్, ఎం.గంగరాజు, కె.కొండయ్య, మారయ్య, బాబురావు, దుర్గమ్మ, రమాదేవి, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించాలి

పెదపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించిన తరువాత మాత్రమే ఉపాధ్యాయ బదిలీలు జరపాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అన్నారు. కొత్తూరు, పాతముప్పర్రు, వీరమ్మకుంట, సత్యవోలు, వసంతవాడ, పెదపాడు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు చట్టం రూపొందించాలన్న నిర్ణయాన్ని పీఆర్‌టీయూ స్వాగతిస్తుందని, ఇంగ్లీషు మీడియంకు సమాంతరంగా తెలుగు మీడియం కూడా ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు తెలుగు మీడియంలో కూడా పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎంప్లాయీస్ హెల్త్ కార్డులు నిరుయోగంగా మారాయని, దానిలోని లోపాలను సవరించి తక్షణం అన్ని వ్యాధులకు వైద్యం ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వరరావు, సయ్యద్ ముర్శలీన్, శశిరేఖ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు

ఫొటోగ్రాఫర్ల సంఘం కార్యవర్గం

టి.నరసాపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద ఫొటోగ్రాఫర్లు యూనియన్ ఆధ్వర్యంలో నిర్మించిన లూయిస్ డాగురే బస్ షెల్టర్ వద్ద శుక్రవారం ఫొటోగ్రాఫర్లు యూనియన్ సమావేశం నిర్వహించారు. ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక జిల్లా కార్యదర్శి వీఆర్ చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆర్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ జి.మహారాజు, కార్యదర్శి పి.చందు, జాయింట్ సెక్రటరి టి.సురేష్, కోశాధికారి ఎం.వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడు మాట్లాడుతూ యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి, కామవరపుకోట, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నాలుగు అగ్ని ప్రమాదాలు

ఏలూరుక్రైమ్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున జిల్లాలో నాలుగు అగ్ని ప్రమాదాలు సంభవించాయి. రెండు షార్ట్ సర్క్యూట్ కాగా మరో రెండు తారాజువ్వలు పడి ప్రమాదాలు జరిగాయి. ఏలూరు గూడ్స్ షెడ్డు రోడ్డులో పేకర్స్, మూవర్స్ కార్యాలయంలో గురువారం షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం సంబవించగా రూ.2లక్షలు నష్టం వాటిల్లింది. నూజివీడులో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక బేకరి దగ్ధం కాగా రూ.5లక్షలు నష్టం వాటిల్లింది. భీమడోలులో ఒక ఇంటిపై తారజువ్వపడడంతో తాటాకిల్లు దగ్ధమైంది. రూ.50వేలు నష్టం వాటిల్లింది. పెదవేగి మండలం జానంపేటలో డ్రిప్ ప్లాస్టిక్ పైపులపై తారజువ్వపడటంతో దగ్ధమయ్యాయి. రూ.50వేలు నష్టంవాటిల్లినట్లు జిల్లా అదనపు అగ్నిమాపక శాఖాధికారి వీ.రామకృష్ణ చెప్పారు.


స్వామి వారి ఊరేగింపులో టపాసులు

శ్రీవారి క్షేత్రంలో దీపావళి వేడుక

ద్వారకాతిరుమల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తొళక్కవాహనాన్ని అధిరోహించిన చిన వెంకన్న, ఉభయదేవేరులతో కలిసి శుక్రవారం రాత్రి శ్రీవారి క్షేత్ర పురవీధుల్లో విహరించారు. అమావాస్య మిగులు తిథినాడు క్షేత్రంలో స్వామివారికి దీపావళి వేడుకలు జరుపుతారు. ఈ క్రమంలో స్వామి, అమ్మవార్లు గ్రామంలో ఊరేగుతుండగా పురజనులు, భక్తులు స్వామి వారి వాహనం ముందు బాణసంచా కాల్చి తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

● ఏలూరు టూటౌన్: పవర్‌పేట ఎమ్మెల్యే బడేటి క్యాంపు కార్యాలయంలో బడేటి చంటి కుటుంబ సభ్యులు గురువారం దీపావళి పండుగ ఘనంగా జరుపుకున్నారు. బడేటి చంటి, మీనా దంపతులతో పాటు దివంగత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చంటి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

● ఏలూరు రూరల్: దీపావళి పండుగను నగరప్రజలు ఘనంగా జరుపుకున్నారు. లక్ష్మీదేవిపూజ అనంతరం బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. నగరం బాణాసంచా పేలుళ్ళతో మార్మోగింది.

● పెదవేగి: అమావాస్య రోజున నిండు పున్నమి వెలుగులను విరజిమ్ముతూ తారాజువ్వలు ఆకాశంలో మిరుమిట్లు గొలిపే కాంతులను పంచాయి. పెదవేగి మండలంలో ప్రజలు దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించారు.



కొండచిలువ హతం

పోలవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటుకలకోట పైడిపాక చంద్రన్న పునరావాస కాలనీలో శుక్రవారం గ్రామస్థులు భారీ కొండచిలువను హతమార్చారు. సమీపంలో అడవుల నుంచి సుమారు 12 అడుగుల పొడవు కొండచిలువ గ్రామంలోకి చొరబడింది. కుక్కలు, కోళ్ళు భయపడి అరవడంతో అప్రమత్తమైన యువకులు కొండచిలువను గమనించి హతమార్చారు.

శివ పూజకు వేళాయె..



నేటి నుంచి కార్తీకమాస పూజలు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం వచ్చేసింది. శివ పూజకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని రెండు పంచారామాలతో పాటు ప్రముఖమైన జుత్తిగలోని ఉమావాసుకీ రవి సోమేశ్వరస్వామి, నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి, ఆచంటలోని రామేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే దేవదాయధర్మాదాయశాక జిల్లా అధికారి సుబ్బారావు పలు దేవాలయాల్లో పర్యటించి కార్తీకమాసం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామాలకు బస్సులు

కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు పంచారామాల దర్శనానికి ఆర్టీసీ బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. పంచారామ దర్శిని పేరుతో బస్సులు జిల్లాలోని 4 డిపోల నుంచి నడపేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి సోమవారం నాడు పంచారామాల్లోని స్వామి వార్లను దర్శించుకునేందుకు ఆర్టీసీ ద్వారా శుక్రవారంనాటికి 7 బస్సులు బుక్ అయ్యాయి. ఇందులో భీమవరంనుంచి 3, నరసాపురం నుంచి 1, తాడేపల్లిగూడెం నుంచి 1, తణుకు డిపో నుంచి 2 బస్సులు సిద్ధం అయ్యాయి.

పట్టిసీమలో సౌకర్యాలు

పోలవరం నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం పట్టిసీమలో వసతులేవి అనే శీర్షికన వచ్చిన వార్తా కథనానికి స్పందన లభించింది. ఆలయ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాల ఏర్పాటు పనులు వేగవంతంగా నిర్వహి ంచారు. భక్తులు ఇసుక తిన్నెల్లో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించేందుకు విద్యుద్దీపాలు, ఆలయ ప్రాంగణంలో రద్దీ నివారణకు క్యూలైన్లు, ఫ్యాన్లు, బారికేడ్‌లు, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మరమ్మతుకు గురైన మంచినీటి ఆర్వో సిస్టంను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకువచ్చారు. కార్తీక మాసం నెలరోజులు నిత్యాన్నదానం, అల్పాహారం, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. 15 తేదీ శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి లక్షపత్రి పూజ, సాయంత్రం ఆరు గంటలకు గోదావరి హారతి కార్యక్రమం అనంతరం పట్టిసీమ గ్రామంలో జ్వాలాతోరణం సేవ, 25వ తేదీ 4వ సోమవారం ఆలయ ప్రాంగణంలో స్వామివారికి లక్షదీపోత్సవం నిర్వహిస్తామని ఆలయ నిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు తెలిపారు.

భద్రతా ఏర్పాట్లు

భీమవరం క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భక్తులు కార్తీక పుణ్యస్నానాలు ఆచరించే ముఖ్యమైన సముద్రతీర ప్రాంతాలు, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు, కాలువల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. తెల్లవారుజాము స్నానాలకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ వెంట పిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకుని వెళ్లినట్లయితే వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలు ఒంటరిగా వెళ్ళకూడదని, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో తెలియని లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్ళకూడదన్నారు. దీపాలు వెలిగించే సమయంలో మహిళలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తులు శైవ ఆలయాలకు, ఘాట్ల వద్ద స్నానాలు చేయడానికి వచ్చినప్పుడు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముఖ్యమైన ఘాట్ల వద్ద, గోదావరి నది పరీవాహక తీర ప్రాంతాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఏలూరులో ఉల్లి బాంబుల పేలుడు

● ఒక యువకుడి మృతి ● 8 మందికి తీవ్రగాయాలు



ఘటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు టూటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున గురువారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఏలూరు వన్‌టౌన్‌లో ఆకస్మాత్తుగా పేలుడు సంభవించడంతో నగరప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇద్దరు యువకులు ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో పెట్టుకుని స్కూటర్‌పై వెళ్తుండగా పేలుడు సంబవించింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడితో పాటు మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. ఏలూరు సత్యనారాయణ పేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ తాబేలు సాయిరామ్ అతడి స్నేహితుడు ఏలూరు మారుతీనగర్‌కు చెందిన పూల కొట్టులో పని చేసే దుర్గాసి సుధాకర్(28) కలిసి ఏలూరు మాదేపల్లి రోడ్డులోని కబేళప్రాంత సమీపం నుంచి ఉల్లిపాయ బాంబులను గోనెసంచిలో వేసుకుని స్కూటర్‌పై సత్యనారాయణపేట వెళ్తున్నారు. మార్గమధ్యలో తూర్పువీధి గౌరమ్మ గుడి వద్ద ఆకస్మాత్తుగా ఉల్లిపాయబాంబులు పేలడంతో పెద్ద విస్పోటం సంబవించింది. సుధాకర్ రెండు ముక్కలైపోయాడు. అతడి ఎడమకాలు రెండుమీటర్ల దూరంలోని మూడంతస్తుల భవనంపై పడగా కుడికాలు పక్కనే ఉన్న భవనంపై పడింది. గౌరమ్మ గుడి ఎదురుగా నిలబడి మాట్లాడుకుంటున్న ఏడుగురు యువకులైన అదే ప్రాంతానికి చెందిన కె.శ్రీనివాసరావు, ఎస్‌కే.ఖాదర్, మళ్ళా పెద్దిరాజు, సువ్వారి శశి, మెడికల్ షాపు సురేష్, బొడ్డేటి సతీష్‌కుమార్, సువ్వారి సత్యనారాయ ణ తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌కే.మదీనబాషా వారి వద్దకు చేరుకుని క్షత గాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆర్తనాదాలు

క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో కాలిన గాయాలతో ఉన్నవారు పెట్టిన కేకలు వర్ణనాతీతం. వారి కేకలు విన్న బంధువులు తల్లడిల్లిపోయారు. వారి రోదనలతో ఆసుపత్రి వద్ద ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి వైద్యులు ప్రసాదరెడ్డి, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ మల్లికార్జునరాజు, డాక్టర్ కుమార్ పలువురు వైద్యులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యసేవలందించారు. తాబేలు సాయిరామ్ పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అతడిని విజయవాడ తరలించారు. సురేష్, సతీష్ కుమార్, సత్యనారాయణలను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పెదవేగి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున ఆ ఇంటిలో విషాదం నెలకొంది. సాగు నష్టాలను అధిగమించలేక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడి అసువులు బాసాడు. ఎస్ఐ కె.రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలివి.. వంగూరుకు చెందిన మేకా శివన్నారాయణ (32) రెండున్నర ఎకరాలలో మిర్చి, వరి సాగు చేశాడు. వరుసగా నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. గత నెల 27న పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని తొలుత ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అనంతరం విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆయనకు భార్య సుధారాణి, ఇద్దరు కుమార్తెలు, రెండేళ్ళ కుమారుడు ఉన్నారు.

తణుకులో ఒకరి హత్య

తణుకు: తణుకు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం అర్ధరాత్రి ఒకరు హత్యకు గురయ్యాడు. తణుకు సజ్జాపురానికి చెందిన కాకర్ల దుర్గారావు(35)గా పోలీసులు గుర్తించారు. స్కూలు ప్రాంగణంలో గురువారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి నిర్దేశిత సమయంలో పోలీసులు షాపులు మూయించిన తర్వాత ఇద్దరి మధ్య ఘర్షణలో ఒకరు హత్యకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం కొంతమంది వాకర్స్ మృతదేహాన్ని గమనించి పోలీసులు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ విశ్వనాథ్, సీఐ కొండయ్య ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహంపై గాయాలు పరిశీలించి హత్య కేసు నమోదు చేస్తినట్టు పోలీసులు తెలిపారు.

పాడి పరిశ్రమ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురజ గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో 2023-24 సంవత్సరానికి 118 మంది సభ్యులకు రూ.4.51 లక్షల డివిడెండ్లను, 163 మంది ఉత్తమ పాల ఉత్పత్తిదారులకు బహుమతులుగా మిల్క్ క్యాన్లు శుక్రవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో పాల ఉత్పత్తిని పెంచేందుకు పశుపోషకులకు పలు రాయితీలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెబుతూ కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తిదారులకు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సంఘం నిర్వహణలో సంఘ అధ్యక్షురాలు ఉప్పలపాటి శ్రీ లక్ష్మి, సభ్యుల కృషి అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కృష్ణా మిల్క్ యూనియన్ ఎం.డి. కొల్లి ఈశ్వరప్రసాద్, డైరెక్టర్ వల్లభనేని సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● గురజలో టీడీపీ నాయకుడు అడుసుమిల్లి రామకృష్ణ ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే కామినేని ప్రారంభించారు.

వడాలిలో బైక్ చోరీ

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వడాలి వద్ద బైక్ చోరీకి గురైన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 11న గ్రామానికి చెందిన అనగాని వీర వెంకటేశ్వరరావు తన బైక్‌ను రోడ్డుపక్కన పెట్టి దూరంగా ఉన్న పొలంలో పురుగుమందు పిచికారీ చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించ లేదు. శుక్రవారం ఆ రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి : కామినేని



కైకలూరులో దీపం-2 పథకం ద్వారా గ్యాస్‌బండలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సూపర్-6 పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద దీపం-2 ద్వారా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్‌బండల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్-6 పథకాల్లో ఒకటైన దీపం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అంచలంచెలుగా అన్ని పథకాలను అమల్లోకి తీసుకువచ్చి పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఈ పథకం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, బలే ఏసురాజు, పోలవరపు లక్ష్మీరాణి, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

95 శాతం పైగా పింఛన్ల పంపిణీ

కొన్ని చోట్ల సర్వర్ సమస్యతో కొంత జాప్యం



అక్కిరెడ్డిగూడెంలో పింఛన్ పంపిణీ

ముసునూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలో 95శాతం పెన్షన్ల పంపిణీ జరినట్లు ఎంపీడీవో జి.రాణి శుక్రవారం తెలిపారు. గ్రామాల్లో కూటమి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యాకర్తలు, ఆశావర్కర్లు సంయుక్తంగా ఉదయం 5గంటల నుండి పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. 8గంటల వరకు పెన్షన్ల పంపిణీ వేగంగా కొనసాగింది. సర్వర్ పనిచేయకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు పూర్తిగా పెన్షన్ల పంపిణీ నిలిపోయింది. మరళ సర్వర్ పనిచేయడంతో తొలిరోజు 95 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. అక్కిరెడ్డిగూడెంలో రాష్ట్ర బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, గోపవరంలో మాజీ ఎంపీటీసీ పల్లిపాము జయరాజు, లోపూడిలో టీడీపీ లక్కపాము కాంతరావు, చలమాల వెంకటేశ్వరరావు, నక్కా చెన్నారావు లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేశారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ల పెంపుపై ఇచ్చిన హామీని అమలు చేసి, సమర్ధవంతగా నెలలో మొదటిరోజే పెన్షన్లను ఇంటివద్దే అందజేస్తుందని నాయకులు పెర్కొన్నారు.

● మండవల్లి: మండలంలో సామాజిక పెన్షన్ల కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లను 95 శాతం లబ్ధిదారులకు పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. మండవల్లి ఒకటో వార్డులో బీజేపీ నాయకులు గంగునేని వరప్రసాద్ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ శేషసాయి కుమార్, అంగన్వాడీ కార్యకర్త కె.సరస్వతి పాల్గొన్నారు.

● ముదినేపల్లి : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ శుక్రవారం ముదినేపల్లి మండలంలో 90 శాతం పూర్తయిందని అధికారులు తెలిపా రు. మండలంలో 8,924 మంది పెన్షనర్లకు రూ.3.79 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేయాల్సి ఉండగా, తొలి రోజు సుమారు 8,204 మంది పెన్షనర్లకు రూ.3.42 కోట్లు పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. వడాలిలో నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు బొప్పన సుందరరామయ్య, కొత్తూరు విఠల్, దావు నాగరాజు పెన్షన్లు పంపిణీ చేశారు.

● చాట్రాయి: మండలంలో సర్వర్‌సరిగా పనిచేయకపోవడంతో పింఛన్ల పంపిణీకి తీవ్ర జాప్యం జరిగింది. ఉద్యోగులు ఉదయం నుంచి లబ్దిదారుల వద్దకు వెళ్లగా సర్వర్ సరిగా పని చేయక ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి 88శాతం పింఛన్‌లను పంపిణీ చేశారు. చనుబండలో మొరంపూడి శ్రీనివాసరావు, నాయకులు పింఛన్‌లను పంపిణీ చేశారు. జనార్ధనవరంలో పలగాని దుర్గారావు, కలకొండ భాస్కర్ రావు, నాగమల్లి వెంకటేశ్వరరావు తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

కార్యకర్తల శ్రేయస్సు కోరేది తెలుగుదేశం పార్టీ

నూజివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల శ్రేయస్సు కోరే ఏకైక పార్టీ టీడీపీ అని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులో టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.100 సభ్యత్వంతో రూ.5లక్షల ప్రమాద బీమా పార్టీ అందిస్తోందన్నారు. సభ్యత్వ నమోదులో నూజివీడు నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలపాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ బాటలో చంద్రబాబు, అవ్వాతాతలకు రూ.4వేలు పింఛన్, నిరుద్యోగులకు డీఎస్సీ, మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ మంజూరును ప్రవేశపెట్టి సంక్షేమ, అభివృద్ధి పాలనను చేసి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు కొనుగోలుకు రూ.70వేలు వితరణ

నూజివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రావిచర్ల తపస్థలి ధ్యాన గురువులు గుడివాడ నాగరాజు, విమల దంపతులు ఫ్రీజర్ బాక్స్ కొనుగోలుకు నూజివీడు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థకు రూ.70వేలు అందించారు. నూజివీడులో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రసాద్‌కు వారు చెక్కును లాంఛనంగా అందించారు.

నేటి నుంచి కార్తీక అన్నదానం

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా శ్రీమరిపురంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం నుంచి కార్తీక అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుంది. అయ్యప్ప భక్తులు, భవానీ దీక్షాపరులకు నెల రోజులపాటు నిత్యం దాతల సహకారంతో నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభిస్తారు. అన్న దాన కార్యక్రమ నిర్వాహకుడు నీలం మల్లేశ్వర రావు గురుస్వామి శుక్రవారం ఎమ్మెల్యేను కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

పార్వతీ పరమేశ్వరులకు పూజలు

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉప్పరగూడెం గ్రామంలో నాగులచవితి ఉత్సవా ల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరులకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. పది రోజులుగా ఆ గ్రామ ఆచార సంప్రదాయాల ప్రకారం నిర్వహి స్తున్న ఉత్సవాల్లో నిత్యం భక్తులు పూజలు జరుపు తున్నారు. నైవేద్యాలను సమర్పించి స్వామివారికి పలు రకాల ఫల పుష్పాలతో అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు నాగుల చవితి వరకు జరుగుతాయి. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డి సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం అల్లూరులో వున్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి కార్తీక మాసోత్సవాలు ప్రారంభం కాను న్నా యి. ఈ ఉత్సవాలు డిసెంబరు ఒకటో తేదీ వరకు జరుగుతాయి. ఈనెల రెండో తేదీ సాయంత్రం ఆకాశ దీపారాధన, 4న కార్తీక సోమవారం దీపా రాధనలు, 11న రెండో సోమవారం పూజలు, 15న జ్వాలా తోరణం, 18న అభిషేకాలు, 21న మహా న్యాస పూర్వక రుద్రాభిషేకం, 28న నందీశ్వ ర స్వామికి విశేష అభిషేకం, 30న కాలభైరవ ఉత్సవం, ఒకటిన ముగింపు కార్యక్రమం, 2న పోలి స్వర్గం కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం ఏవో సింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు సుబ్బరాయ శర్మ తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం



ఓటు నమోదు పత్రాలను అందజేస్తున్న టీచర్లు

ముసునూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి జడ్పీపాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు నమోదు కార్యక్రమాన్ని యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యాదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబులు కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ఓటు నమోదుకు ఫామ్-18 పత్రాలను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అందజేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కె.యస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు కోరారు.

● చాట్రాయి: కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుమేరకు చనుబండలో ఎమ్మెల్సీ ఓట్లను టీడీపీ నాయకులు నమోదు చేయించారు. చనుబండ 6వ బూత్ కన్వీనర్ నక్కారాము ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్‌లకు సంబంధించి ఓట్ల నమోదుపై అవగాహన కల్పించి వారిని నమోదు చేయించారు.

పంట పెట్టుబడి సాయం విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని వెంకటరామారావు

నూజివీడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు సుఖీభవ పథకంలో పంట పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలని రైతుసంఘం నియోజకవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నూజివీడు అమర్‌భవన్‌లో రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రైతులను సమీకరించి సంఘ నిర్మాణానికి పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానం చేసిన రైతు సుఖీభవ పథకంలో రూ.20వేలను రైతు ఖాతాలో తక్షణం జమ చేయాలన్నారు. గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వమైనా రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నవంబరు 4న సచివాలయాల్లో మెమోరాండం ఇస్తామన్నారు. నిమ్మగడ్డ నరసింహారావు, అక్కినేని రాజా, నాగేంద్రరావు, నాగేశ్వరరావు, వలసపల్లి ఆనందరావు, ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు

కలిదిండి, నవంబరు (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలిదిండిలో అమజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పూర శ్రీధర్, నీలి సుమన్, నూకల శ్యామలరావు గుప్తా, సునీల్, చక్కా జగన్, గొంద్రాల సుబ్బయ్య, సూరిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ఆర్థిక ప్రయోజనాలు



పెదగొన్నూరులో టీడీపీ సభ్యత్వాల నమోదులో నరసింహారావు, వినోద్

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పెదగొన్నూరులో కైకలూరు నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ నిర్వహించారు. గ్రామంలో ఒక్క రోజే సుమారు వంద మంది పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు బీమా సౌకర్యం, పిల్లల చదువులకు ఆర్థిక సాయం, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు నాయకులు వివరించారు. టీడీపీ నాయకులు గుడివాడ వేణు, నాగిరెడ్డి శివ ప్రసాద్, యార్లగడ్డ గంగయ్య, నందం సాయిబాబు, తుమ్మలచర్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

మట్టగుంటలో రెవెన్యూ గ్రామసభకు 36 అర్జీలు

కలిదిండి, నవంబరు (ఆంధ్రజ్యోతి): మట్టగుంటలో శుక్రవారం నిర్వహించిన భూ రీసర్వే గ్రామసభకు 36 మంది రైతులు అర్జీలు అందించారని డీటీ ఆనంద్ శుక్రవారం తెలిపారు. సర్పంచ్ అంద్రాజు రత్నమణి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్యారజు శ్రీనివాస్, ఎంపీటీసీ సరూప, సర్వే యర్ మహ్మద్ షమీ, వీఆర్వో డేవిడ్ పాల్గొన్నారు.



దగ్ధమైన బేకరి

బేకరిలో అగ్ని ప్రమాదం

నూజివీడు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ని బేకరిలో అగ్ని ప్రమాదం సంభవించింది. లిఖిత అయ్యంగార్ బేకరిలో గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల వారు భయాందోళనకు గురయ్యారు. నూజివీడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేయడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

రూ.7,330 విలువైన బాణసంచా స్వాధీనం

ముదినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సందర్భంగా వణుదుర్రు గ్రామంలో లైసెన్స్ లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న కోహూరు సత్యసుబ్రహ్మణ్యం అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలిపారు. అతడి నుంచి సుమారు రూ.7330 విలువైన మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడి

కలిదిండి, నవంబరు (ఆంధ్రజ్యోతి) : మట్టగుంట గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.3,500 నగదు, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కలిదిండి, నవంబరు (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలిదిండి మండలం గోపాలపురంలో జరిగింది. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పరసా ధనరాజ్ (40) అక్టోబరు 27న మద్యం సేవించి అనారోగ్యం పాలవ్వడంతో భీమవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.



ఎంపికైన విద్యార్థి హేమలత

ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలకు దిగవల్లి విద్యార్థిని

నూజివీడు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో దిగవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె.హేమలత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆర్.శోభారాణి తెలిపారు. గుడివాడ పొట్టి శ్రీరాముల హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయిలో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి హేమలత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు.

వల్లభాయ్ పటేల్‌కు నివాళి

ముసునూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతకు విశేష కృషిచేసి, భారత దేశపు ఉక్కు మనిషిగా బిరుదు పొందిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఈవోపీఆర్డీ బి.ఎ సత్యనారాయణ అన్నారు. గురవారం మండల పరిషత్ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఈవోపీఆర్డీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన పట్టుదల, కృషి నేటి యువతకు ఆదర్శనీయమని, యువత సర్దార్ ఆశాయాల సాధనకు కృషిచేయాలి ఈవోపీఆర్డీ కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు కోండిబోయిన నాగేశ్వరావు, డిజిటల్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సైకిల్ షెడ్ నిర్మాణం

ఆగిరిపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు అడవి నెక్కలం గ్రామ చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ వారు బాల బాలికలకు సైకిల్ షెడ్ నిర్మించారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం బాల బాలికలకు భోజనాల షెడ్ కూడా నిర్మించి ఇస్తామని తెలిపారు. ఆగిరిపల్లి విద్యార్థుల క్రమశిక్షణ, హెడ్ మాస్టర్ పుష్పలత సేవా కార్యక్రమాలకు మెచ్చి ఈ కార్యక్రమాలు చేస్తున్నట్లు సుధ తెలిపారు. చుక్కపల్లి చారిటబుల్‌ట్రస్ట్ తరపున సుధా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుధను పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

నూజివీడు టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద గాంధీబొమ్మ సెంటర్లో ఏఐటీయుసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు జెండా ఆవిష్కరించారు. కార్మిక హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన ఏఐటీయుసీ 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, సమసమాజ స్థాపన కోసం త్యాగాలు చేసిన చరిత్ర ఏఐటీయుసీదే అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయుసీ అధ్యక్షులు అక్కినేని అంజనేయ ప్రసాద్, ముఠా యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణ, రైతు సంఘం నాయకులు నరసింహ, తదితరులు పాల్గొన్నారు.